
Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4782

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 01 | సోమవారం 27 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## హిమాచల్‌ప్రదేశ్‌లో
# కదంతొక్కిన ఉపాధ్యాయులు

- ప్రాథమిక విద్యావ్యవస్థ నిర్వీర్య చర్యలపై ఆగ్రహం
- 'స్కూల్ కాంప్లెక్స్ సిస్టమ్' ఉపసంహరణకు డిమాండ్

సిమ్లా - సూర్య వాస్తవం

హిమాచల్ ప్రదేశ్‌లో ప్రాథమిక ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. ప్రధానోపాధ్యులు, ఉపాధ్యాయుల సంఖ్య కుదింపు ద్వారా ప్రాథమిక విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు తీసుకొచ్చిన 'స్కూల్ కాంప్లెక్స్ సిస్టమ్'ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 15 రోజుల పాదయాత్రలు చేపట్టి ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఆదివారం సిమ్లాలోని చారిత్రాత్మక చౌరా మైదానంలో నిరవధిక రిలే నిరాహార దీక్ష? ప్రారంభించారు. 'స్కూల్ కాంప్లెక్స్ సిస్టమ్'ను రద్దు చేయాలనే డిమాండ్ నెరవేరేంతవరకు నిరాహార దీక్ష? కొనసాగుతుందని స్పష్టం



చేశారు. హిమాచల్ ప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయుల సమాఖ్య (హెచ్‌పిపిటిఎఫ్)

- మిగతా 2లో..

## పరీక్షల సంస్కరణల కోసం
# హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

- ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడునందన్ నీలేకని నేతృత్వం
- ఐదుగురు సభ్యులతో కమిటీ : ప్రధాని మోడీ వెల్లడి

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం రేపిన వేళ కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. ఈ క్రమంలోనే పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫారసు లకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్టు ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ వీడియో విడుదల చేశారు. "ఈ టాస్క్‌ఫోర్స్ పరీక్షల సంస్కరణలపై దృష్టి పెడుతుంది. కమిటీ నివేదిక అధారంగా విశ్వసనీయత దెబ్బతినకుండా



భవిష్యత్‌లో పరీక్షల నిర్వహణపై ప్రభు త్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రశ్న పత్రం లీకేజీని అరికట్టేందుకు కఠినమైన చట్టం

- మిగతా 2లో..



## కేంద్ర విద్యాశాఖ మంత్రిగా
# ప్రహ్లాద్ జోషి బాధ్యతల స్వీకారం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నీట్ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా 36 రోజులుగా విద్యార్థుల చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా చేసిన కాసేపట్లోనే ప్రహ్లాద్ జోషికి ఈ శాఖను అప్పగించారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించిన

- మిగతా 2లో..



# ఇది ఆరంభమే

- ఈ పోరాటం ఇక్కడితో ఆగిపోదు
- బొద్దింకలు శాంతియుతంగా ఉద్యమించాయి
- అండగా ఉన్న వారందరికీ ధన్యవాదాలు : సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్యానికి విజయమని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. నిరసనను విరమించడం అంటే ఉద్యమం ముగిసిపోయినట్టు కాదని అన్నారు. "ఇది కేవలం ఆరంభం మాత్రమే. కాక్రోచ్ జనతా పార్టీకి

- మిగతా 2లో..

## కూటమి పాలనకు రెండేళ్లు:
# నేటి నుంచి టీడీపీ ఇంటింటి ప్రచారం...

- నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్.
- రెండేళ్ల కూటమి పాలనపై రేపటి నుంచి 45 రోజుల పాటు డోర్ టు డోర్ ప్రచారం
- ప్రభుత్వ విజయాలను, హామీల అమలును ప్రజలకు వివరించాలని నేతలకు చంద్రబాబు ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- అనుచరులుగా కాదు, నాయకులుగా ఎదగాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- గొడ్డలి పార్టీ విధ్వంసకర విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని దిశానిర్దేశం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేటి నుంచి (సోమవారం) 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'డోర్ టు డోర్' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ



నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ బృహత్ కార్యక్రమంలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని కట్ట బెట్టారని గుర్తుచేశారు. "94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లతో మనం గెలిచాం. నాటి ప్రభుత్వ విధ్వంసం, ఘోర తప్పిదాల వల్లే 151 సీట్ల పార్టీ 11 సీట్లకు పడిపోయింది" అని ఆయన వ్యాఖ్యా నించారు. కూటమి పార్టీల పోరాటాలు, ఎన్నికల వ్యూహాల వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని తెలిపారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. "ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఎలాగైతే ప్రతి ఇంటికీ వెళ్లారో, ఇప్పుడు కూడా అదే విధంగా వెళ్లి మనం ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తున్నామో చెప్పాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి" అని సూచించారు.

**నాకు కావాల్సింది అనుచరులు కాదు!**

పార్టీలో నాయకత్వ పటిమను పెంచుకోవాల్సిన ఆవశ్యకతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "నాకు కావాల్సింది

- మిగతా 2లో..



## విద్యార్థులపై ప్రాణాంతక దాడికి
# అనుమతిచ్చింది మీరు కాదా?

- అమిత్ షాకు రాహుల్ గాంధీ ఘాటు లేఖ
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లేఖ
- జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై దాడిని ఖండించిన రాహుల్
- శాంతియుత నిరసనపై పెల్లెట్ గన్లు వాడారని తీవ్ర ఆరోపణ
- దాడికి అనుమతి ఎవరు ఇచ్చారో చెప్పాలని లేఖలో డిమాండ్
- మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత వారం విద్యార్థులపై జరిగిన పోలీసు దాడి ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. విద్యార్థులపై జరిగిన ఈ "క్రూరమైన దాడి"కి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఆదివారం

- మిగతా 2లో..



## కార్గిల్ వీరులకు చంద్రబాబు, పవన్ నివాళి..

- త్యాగాలను స్మరించుకున్న నేతలు
- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళులు
- సైనికుల త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమన్న చంద్రబాబు
- కార్గిల్ విజయం భారత స్ఫూర్తికి ప్రతీక అన్న పవన్ కల్యాణ్

2లో

# రాజకీయాలు అవినీతిమయం

- ఇకపై నేను ఎన్నికల్లో పోటీ చేయను: సిద్ధరామయ్య
- నిజాయతీకి చోటు లేకుండా పోయిందని ఆవేదన

**బెంగళూరు - సూర్య వాస్తవం :** అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై కర్నా టక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత రాజకీయాలు అవినీతి మయం అయ్యాయని 2028 అసెంబ్లీ ఎన్నికలు సహా భవిష్యత్తులో ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని ప్రకటించారు. వయసుతో పాటు అనారోగ్య సమస్యలు కూడా ఒక కారణమని తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి తనకు 82 ఏండ్లు వస్తాయని సిద్ధరామయ్య తెలిపారు. గతంలో లాగా ఉత్సాహంతో పని చేయడం తనకు ఇక సాధ్యం కాదని రాసుకొచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ప్రజా జీవితంలో చురుగ్గా ఉంటానని అన్నారు. ప్రజల తరఫున గళం వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు.



అయితే, వరుణ నియోజకవర్గం నుంచి మళ్లీ పోటీ చేయాలని ప్రజలు కోరినప్పటికీ వాటిని తిరస్కరించినట్టు సిద్ధరామయ్య వెల్లడించారు. గతంలో తాను పోటీ చేసినప్పుడు ప్రజలే విరాళాలు సేకరించి తనను గెలిపించారని అన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని

- మిగతా 3లో..

## దేశ భవిష్యత్‌కు
# యువశక్తే పునాది

- జై జవాన్ - జై కిసాన్ జై యువ అని నినదించండి
- లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తి వయస్సు 21 ఏండ్లకు తగ్గించాలి
- తీర్మానాన్ని ఉభయ సభల్లో అమోదించి కేంద్రానికి పంపిస్తాం
- ఢిల్లీ ఉద్యమ బాధిత కుటుంబాలకు సాయం అందించాలి : జాతీయ మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ - సూర్య వాస్తవం :

యువశక్తే దేశ భవిష్యత్‌కు పునాదిగా నిలుస్తుందని, అందుకే 'జై జవాన్ -- జై కిసాన్ -- జై యువ' అని నినదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్ నిర్మాణంలో యువతను మరింత భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తుల కనిష్ఠ వయోపరిమితి ని 25 ఏండ్ల నుంచి 21 ఏండ్లకు



- మిగతా 3లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## హిమాచల్‌ప్రదేశ్‌లో
# కదంతొక్కిన ఉపాధ్యాయులు

(మొదటిపేజీ తరువాయి)
ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆందోళనల్లో ప్రస్తుత, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులతో పాటు మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, బహుళ విధుల కార్మికులు, ఇతర విద్యా శాఖ ఉద్యోగులు కూడా పాల్గొన్నారు. పాంగీ, డోడ్రా క్వార్ వంటి మారుమూల గిరిజన ప్రాంతాల ఉపాధ్యాయులు కూడా ఉద్యమంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో గతేడాది సెప్టెంబర్ నుంచి ఏకపక్షంగా అమలు చేస్తున్న 'స్కూల్ కాంప్లెక్స్ సిస్టమ్'ను వెంటనే రద్దు చేయాలని హెచ్‌పిపిటిఎఫ్ డిమాండ్ చేస్తోంది. ఈ విధానంలో పలు ప్రాథమిక, మాధ్యమిక, సీనియర్ సెకండరీ పాఠశాలలను ఒకే పరిపాలనా అధికారి ఆధ్వర్యంలోకి తీసుకువచ్చారని, దీంతో ప్రాథమిక పాఠశాలల స్వయం ప్రతిపత్తి దెబ్బతిందని ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే ఉపాధ్యాయుల నియామకాలు, బోధన వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడిందని హెచ్‌పిపిటిఎఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 11న ప్రారంభమైన 'ప్రాథమిక విద్యను కాపాడండి' పాదయాత్ర సిమ్లాలో విజయ వంతంగా ముగిసిందని హెచ్‌పిపిటిఎఫ్ అధ్యక్ష?న్లు రమేష్ శర్మ పేర్కొన్నారు. కొత్త విధానంలో 15-20 పాఠశాలలను ఒకే ఛత్రం కిందకు తీసుకొచ్చి ఆ మేరకు ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యులను కుదించి ఒకే పరిపాలనాధికారిని నియమిస్తున్నారని, దీనివల్ల విద్యారంగ ప్రమాణాలు తగ్గిపోతాయని, విద్యార్థులకు కూడా తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయని తెలిపారు. ఇదివరకు పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యుడు ఉంటే ఇప్పుడు 15-20 పాఠశాలలకు కలిపి మొత్తంగా ఒకే ప్రధానోపాధ్యాయుడు ఉంటారని తెలిపారు. ఆ మొత్తం పాఠశాలలు ఆయన నియతంత్రణలోనే నడుస్తాయని తెలిపారు. దీని ప్రభావంతో జేబీటీ, నర్సరీ ఉపాధ్యా యులతో పాటు ఇతర సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 200 ప్రాథమిక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో నడుస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తమ న్యాయబద్ధమైన డిమాండ్లను అంగీకరించి స్కూల్ కాంప్లెక్స్ వ్యవస్థను ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని రమేష్ శర్మ స్పష్టం చేశారు. గతంలో విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలతో ఉద్యమాన్ని విరమించినప్పటికీ, అవి అమలు కాలేదని ఆరోపించారు. విద్యార్థుల చదువులకు అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో వేసవి సెలవుల సమయంలోనే ఈ ఆందోళన చేపట్టామని, ప్రాథమిక విద్యను కాపాడటం తమ లక్ష్యమని ఆయన అన్నారు. ఆదివారం నిర్వహించిన నిరసనలో 15 వేల మందికి పైగా పాల్గొన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఉద్యమ స్థలానికి వచ్చి స్కూల్ కాంప్లెక్స్ సిస్టమ్ ఉపసంహరణను ప్రకటించాలని మండి జిల్లాలోని కర్సోగ్‌కు చెందిన విభిన్న ప్రతిభావంతుడైన ప్రాథమిక ఉపాధ్యాయుడు ప్రకాశ్ పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రస్తుతం సుమారు 20 వేల మంది ప్రాథమిక ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, సుమారు 40 వేల మంది పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు సహా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతర ఉద్యోగులు కూడా ఈ ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నారని హెచ్‌పిపిటిఎఫ్ పేర్కొంది.

దీంతో తమ ఆందోళనలకు మద్దతు తెలుపుతున్న వారి మొత్తం సంఖ్య దాదాపు లక్షకు చేరుకుందని తెలిపింది. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగుతుందని నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు హెచ్చరించారు.

## విద్యార్థులపై ప్రాణాంతక దాడికి
# అనుమతిచ్చింది మీరు కాదా?

(మొదటిపేజీ తరువాయి)
ఒక లేఖ రాశారు. ఈ దాడిలో ప్రాణాంతకమైన పెల్లెట్ గన్లను ప్రయోగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే, జూలై 20న జంతర్ మంతర్ వద్ద "న్యాయమైన, జవాబుదారీతనంతో కూడిన విద్యా వ్యవస్థ" కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టారని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. అయితే, భద్రతా బలగాలు వారిపై విచక్షణారహితంగా బలప్రయోగం చేశాయని ఆరోపించారు. భాష్పవాయువుతో పాటు, ప్రమాదకరమైన పెల్లెట్ గన్లను కూడా వాడారని, ఈ దాడిలో వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ముఖ్యంగా, మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని, వారి సున్నితమైన భాగాలపై దాడి చేశారని తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనలో 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచాబ్ కంటికి పెల్లెట్ తగలడంతో, అతను శాశ్వతంగా కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉందని రాహుల్ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆయన రెండు సూటి ప్రశ్నలు సంధించారు:

1. విద్యార్థులపై పెల్లెట్ గన్ల వంటి ప్రాణాంతక ఆయుధాలను ప్రయోగించడానికి హోం మంత్రిగా మీరు అనుమతి ఇచ్చారా? ఒకవేళ ఇవ్వకపోతే, ఆ అధికారం ఎవరిచ్చారు?

2. సాధారణ దుస్తుల్లో వచ్చి విద్యార్థులను లాఠీలతో కొట్టిన వ్యక్తులు ఎవరు? వారిని రంగంలోకి దించింది ఎవరు?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు.

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థి ఆందోళనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు.

జంతర్ మంతర్ ఘటనకు అమిత్ షానే ప్రత్యక్ష బాధ్యుడని రాహుల్ గాంధీ గతంలోనే ఆరోపించారు. తాజాగా లేఖ రాయడం ద్వారా ఈ అంశంపై ఒత్తిడిని మరింత పెంచారు. అయితే, రాహుల్ గాంధీ లేఖపై కేంద్ర హోం శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే అవసరమైన చర్యలు తీసుకున్నామని ప్రభుత్వ వర్గాలు ఇదివరకే స్పష్టం చేశాయి.

# ఇది ఆరంభమే



(మొదటిపేజీ తరువాయి)
ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది" అని అన్నారు. ఈ ఆందోళనలో అండగా ఉన్న యువత, విద్యార్థులను ఉద్దేశిస్తూ ఆదివారం ఒక వీడియో విడుదల చేశారు. ఇంతకాలం అండగా ఉన్న వారందరికీ ధన్యవా దాలు తెలిపారు. ఈ పోరాటం ఇక్కడితో ఆగిపోదని కూడా ఆయన చెప్పారు. మంత్రి రాజీ నామా కేవలం ఆరంభం మాత్రమే అని అన్నారు. యువత, సీజేపీ మద్దతుదారుల వల్లే ఇదంతా సాధ్య మైందని అన్నారు. బొద్దింకలు శాంతియుతంగా ఉద్యమించాయని ప్రశంసించారు.

**37 రోజులుగా...**

ఇకపై ఏం జరుగుతుందోనన్న ఆందోళన లేకుండా తాను ఎట్టకేలకు "ప్రశాంతంగా నిద్రపోగలనని" చెబుతూ ఆయన మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు. "గత 37 రోజుల్లో నేను ఎదుర్కొన్న పరిస్థితులు చాలా కఠినమైనవి. ఇది నాకు మాత్రమే కాదు, మా బృందంలోని అందరికీ కూడా ఏమాత్రం సులభం కాదు" అని అన్నారు. విమర్శలు, సందేహాలు ఉన్నప్పటికీ ఉద్యమానికి అండగా నిలిచిన దేశవ్యాప్తంగా ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలి పారు. "అన్నింటికంటే ముఖ్యంగా, భారత దేశం అంతటా విస్తరించి ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులందరికీ నేను కృతజ్ఞ తలు చెప్పాల నుకుంటున్నాను. అందరూ మమ్మల్ని అనుమా నిస్తున్నప్పుడు మాపై నమ్మకం ఉంచి, మద్దతునిచ్చి, ఆదరించిన మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ మద్దతు లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు" అని ఆయన పేర్కొన్నారు.

**వ్యక్తిగతంగా కలవలేకపోతున్నా..**

ఆరోగ్య సమస్యల కారణంగా జంతర్ మంతర్ వద్ద గుమిగూడిన మద్దతుదారులను వ్యక్తిగతంగా కలవలేకపోయినందుకు ఈ సందర్భంగా క్షమాపణలు కూడా కోరారు. "నేను నిజంగా క్షమాపణలు కోరుతున్నాను. జంతర్ మంతర్ వద్ద వేచి ఉన్న వారందరినీ కలవలేకపోయాను, వారికి కృతజ్ఞతలు చెప్పలేకపోయాను. ఎందుకంటే నాకు టైఫాయిడ్ వచ్చి తీవ్రమైన జ్వరం ఉంది. నా శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీలు ఉంది. అందుకే నేను ఇంటికి రావాల్సి వచ్చింది" అని వివరించారు.

**దేశం కోసం సమిష్టి పోరాటానికి సెల్యూట్**

"ఈ దేశం కోసం మీరు చేసిన కృషిని నేను ఎంతగానో అభినందిస్తున్నాను. మీ అందరినీ నేను ఎంతో ప్రేమిస్తున్నాను. మీరు లేకపోతే మేము దీనిని సాధించలేకపోయేవాళ్ళం. మీ అందరికీ నా సెల్యూట్" అని అన్నారు. "మా పట్ల సందేహాలు వ్యక్తం చేసిన వారికి, మమ్మల్ని విమర్శించిన వారికి లేదా 'మీరు సీరియస్‌గా లేరు, మీకు నిరసన తెలపడం తెలియదు' అని ప్రశ్నించిన వారికి కూడా నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు మమ్మల్ని విమర్శించి, ప్రశ్నించకపోయి ఉంటే, మేము మెరుగుపడేవారమే కాదు. 'కాక్రోచ్ జనతా పార్టీ'కి ఇంకా సుదీర్ఘ ప్రయాణం ఉంది. కచ్చితంగా మేము చాలా దూరం వెళ్తాము. ఇది కేవలం ఆరంభం మాత్రమే" అని ఆయన అన్నారు.

**ప్రధాన్ రాజీనామా సరే..పరిహారం అందాలి**

"ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. కానీ ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం అందాలి. వారికి అది దక్కాలి. ఆ కుటుంబాలన్నింటికీ కోటి రూపాయల పరిహారం ఇవ్వాలి" అని దిప్కే అన్నారు. అయితే, మరణించిన వారి కుటుంబాలకు సాధ్యమైనంత గరిష్ట పరిహారాన్ని అందించడానికి కేంద్రం అంగీకరించింది. జూలై 20న జరిగిన 'చలో పార్లమెంట్' ర్యాలీలో చోటుచేసుకున్న ఘర్షణలకు సంబంధించి పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

**ఇది ఒక కొత్త ఆరంభం**

యువత సమిష్టి పోరాట శక్తిని ఈ ఉద్యమం చాటిచెప్పిందని సీజేపీ ప్రతినిధి నేహా బోరా అన్నారు. "ఏకమైన యువత మార్పును తీసుకురాగలదు. ఇది ముగింపు కాదు, ఒక కొత్త ఆరంభం" అని ఆమె అన్నారు. విద్య, పాలనలో సంస్కరణల కోసం కృషి చేస్తూనే, యువతను ప్రభావితం చేసే అంశాలను తమ సంస్థ లేవనెత్తుతూనే ఉంటుందని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. "యువతకు సంబంధించిన సమస్యలను లేవనెత్తడం. విద్య, పాలనలో సంస్కరణల కోసం కృషి చేయడం ఈ ఉద్యమం కొనసాగిస్తుంది" అని అన్నారు.

**ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించడం తమ సంస్థ తక్షణ ప్రాధాన్యత కాదు**

ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించడం తమ సంస్థ తక్షణ ప్రాధాన్యత కాదని చెప్పారు. "సుమారు 750-800 రాజకీయ పార్టీలు ఉన్నాయి. కానీ వాటిలో ఏదీ యువత ఆకాంక్షలను నెరవేర్చలేకపోతోంది. అధికారంలో ఏ పార్టీ లేదా నాయకుడు ఉన్నప్పటికీ, వారు యువత కోసం పనిచేసేలా, వారి డిమాండ్లను నెరవేర్చేలా ఒత్తిడి తెచ్చేందుకు ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని మేము కోరుకుంటున్నాము. ప్రస్తుతానికి మా అజెండా ఇదే" అని ఆయన అన్నారు.

**దేశ విద్యా వ్యవస్థను సంస్కరించాలన్నదే మా లక్ష్యం**

"ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఇతర విద్యార్థి సంఘాలకు వారి మద్దతు, మార్గదర్శకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ఉద్యమంలో మీ పాత్ర నిజంగా కీలకమైనది" అని సిజెపి ప్రతినిధి అశుతోష్ రంకా అన్నారు. తమ సంస్థ తక్షణ దృష్టి ఉద్యమ విస్తరణపైనే ఉందని అన్నారు. 'కాక్రోచ్ జనతా పార్టీ' భవిష్యత్తులో రాజకీయ పార్టీగా మారే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ఆయన ఇలా సమాధానమిచ్చారు. "ప్రజా జీవితం, రాజకీయాల్లో నా స్వల్పకాలిక ప్రస్థానంలో నేను నేర్చుకున్న ఏకైక విషయం ఏమిటంటే -- ఎప్పుడూ 'కాదు' అని చెప్పకూడదు. ఎప్పుడూ 'కాదు' అనకూడదు" అని అన్నారు. అయితే, దేశ విద్యా వ్యవస్థను సంస్కరించడమే తమ తక్షణ ప్రాధాన్యత అని ఆయన నొక్కి చెప్పారు. "ఇది ముగిసిపోలేదు. ఇది ఇప్పుడే మొదలవుతోంది. దేశ విద్యా వ్యవస్థ సరిచేయబడే వరకు మేము ఆగిపోము. ఇది మా మాట" అని అన్నారు.

## పరీక్షల సంస్కరణల కోసం
# హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

(మొదటిపేజీ తరువాయి)
తీసుకొస్తున్నాం. దీనికి సంబంధించిన బిల్లును సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెడతాం. విశ్వసనీయమైన, పారదర్శకమైన పరీక్ష విధానం అమలు చేస్తాం. పరీక్షల నిర్వహణలో అత్యున్నత టెక్నాలజీని అవలంబిస్తాం" అని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు.

**టాస్క్ ఫోర్స్ సభ్యులు వీళ్లే..**

నందన్ నీలేకనితో పాటు మరో ఐదుగురు ఈ టాస్క్ ఫోర్సులో సభ్యులుగా ఉంటారు. సోమనాథ్ (ఇస్రో మాజీ చైర్మ న్), తపన్ డేకా (ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్), వి. కామకోటి (ఐఐటీ మద్రాస్ డైరెక్టర్), అనితా కర్వాల్ (కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి), అమృత్ లాల్ మీనా (లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు).

**ప్రధాన బాధ్యతలు**

ఎన్‌టీఏ పరీక్ష వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం పరీక్షల్లో సాంకేతిక భద్రతను బలోపేతం చేయడం పేపర్ లీకులు, మాల్‌ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు కొత్త వ్యవస్థలు రూపొందించడం పరీక్షల నిర్వహణలో నిర్మాణాత్మక సంస్కరణలు సూచించడం డిజిటల్ భద్రత, అభ్యర్థుల ధ్రువీకరణ, డేటా రక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు సిఫారసు చేయడం భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం

## కూటమి పాలనకు రెండేళ్లు:
# నేటి నుంచి టీడీపీ ఇంటింటి ప్రచారం...

(మొదటిపేజీ తరువాయి)
అనుచరులు కాదు, పార్టీకి నాయకులు కావాలి. సమస్యలకు పరిష్కారం చూపే నైపుణ్యాలను అలవర్చుకోవాలి. కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేస్తూ ప్రజలు, కార్యకర్తలతో సన్నిహితంగా మెలగాలి" అని ఆయన హితవు పలికారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు.

గొడ్డలి పార్టీవిధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని చంద్రబాబు కోరారు. "ఘోర ఓటమి చవిచూసినా ఆ పార్టీ ఇప్పటికీ సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. వారి విధ్వంసకర విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. యువతను వారు ఏ విధంగా నిర్వీర్యం చేశారో, యువత భవిత కోసం కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి" అని ఆయన అన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమైతేనే ప్రతిపక్ష కుట్రలను ఎండగట్టగలమని స్పష్టం చేశారు. "మళ్లీ కూటమి అధికారంలోకి రావడం ఖాయం, కానీ ఏమరుపాటు వద్దు. రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం కొనసాగాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ వివరించాలి" అని ఉద్ఘాటించారు. ప్రజల్లో ఉండటాన్ని ప్రతి నాయకుడు బాధ్యతగా స్వీకరించాలని కర్తవ్య బోధ చేశారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి బాధ్యతల స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)
అనంతరం ప్రహ్లాద్ జోషి సోషల్ మీడియాలో స్పందించారు. 'కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాను. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రధాని మోడీకి కృతజ్ఞతలు. వినయంతో, కర్తవ్య నిష్టతో ఈ బాధ్యతను స్వీకరిస్తున్నాను' అని పేర్కొన్నారు. కర్నా టకకు చెందిన ప్రహ్లాద్ జోషి ధార్వాడ్ లోక్‌సభ స్థానం నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలుపొందారు. గతంలో పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖల మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం వినియోగ దారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రిగా ఉన్నారు. ఇక నుంచి విద్యా శాఖ అదనపు బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు.

# కార్గిల్ వీరులకు చంద్రబాబు, పవన్ నివాళి..

**- త్యాగాలను స్మరించుకున్న నేతలు**
**- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళులు**
**- సైనికుల త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమన్న చంద్రబాబు**
**- కార్గిల్ విజయం భారత స్ఫూర్తికి ప్రతీక అన్న పవన్ కల్యాణ్**

**అమరావతి - సూర్య వాస్తవం**

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమరవీరులకు ఘనంగా నివాళు లర్పించారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రాణత్యాగం చేసిన సైనికుల అసమాన ధైర్యసాహసాలను, త్యాగాలను వారు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ మేరకు ఇరువురు నేతలు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తమ సందేశాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందిస్తూ.. "అసాధారణ ధైర్యసాహసాలతో దేశానికి ఘన విజయాన్ని అందించిన యోధులకు నివాళులు అర్పిస్తున్నాను. అత్యంత దుర్భేద్యమైన భూభాగం, ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడారు. వారి అత్యున్నత త్యాగం, అసమాన పరాక్రమం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఇది భారతీయ దేశభక్తికి, జాతీయ గర్వానికి శాశ్వత ప్రతీకగా మిగిలిపోతుంది" అని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సందేశంలో పేర్కొంటూ.. "అసాధారణ శౌర్యంతో, నిస్వార్థ త్యాగంతో త్రివర్ణ పతాక గౌరవాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడిన అమరవీరులకు వినమ్ర నివాళులు. కార్గిల్ కేవలం ఒక యుద్ధ విజయం మాత్రమే కాదు.. అది అజేయమైన ధైర్యానికి, భారతదేశ అచంచల స్ఫూర్తికి నిదర్శనం. మన పవిత్ర మాతృభూమిలోని ప్రతి అంగుళాన్ని మన సైనిక యోధులు ప్రాణాలకు తెగించి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. వారి త్యాగాల పునాదిపైనే మనం నేడు ప్రశాంతంగా జీవిస్తున్నాం" అని తెలిపారు.

## సంపాదకీయం

# ప్రత్యక్ష ఎన్నికల దిశగా అడుగులు




**విజయవాడ -సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాజకీయం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఓ భారీ మలుపు తిరగబోతోంది. స్థానిక సంస్థల్లో ఏళ్ల తరబడి శాపంగా మారిన క్యాంప్ రాజకీయాలు, బేరసారాలు, బెదిరింపులకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య సంస్కరణకు రూపకల్పన చేస్తున్నారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా పరిషత్ ( చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పరోక్ష ఎన్నికల పేరిట స్థానిక సంస్థల్లో సాగుతున్న ప్రజా స్వామ్య హననాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు భావిస్తున్నారు. పరోక్ష ఎన్నికల విధానంలో గ్రామ, వార్డు స్థాయి ప్రజాప్రతినిధులను ఎన్నుకున్న తర్వాత, వారు తమ నాయకుడిని ఎన్నుకుంటారు. ఈ క్రమంలో అధికార బలం, ఆర్థిక ప్రాబల్యం, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం పీక్ స్టేజ్‌కు చేరుకుంటాయి. మెజార్టీ రాని అధికార పార్టీలు కూడా ప్రతిపక్షాల నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులను రిసార్టులకు తరలించడం, క్యాంపులు నిర్వహించడం, రకరకాల ఒత్తిళ్లకు గురిచేసి తమవైపు తిప్పుకోవడం ఆనవాయి తీగా మారింది. చివరికి ప్రజల తీర్పు ఒకటైతే, పీఠంపై కూర్చునేది మరొకరయ్యే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ అక్రమ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజల చేతికే నేరుగా ఓటు హక్కు ఇవ్వడమే ఏకైక మార్గమని భావిస్తున్నారు.సాధారణంగా ఏ అధికార పార్టీ కూడా ఇటువంటి ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావడానికి సాహసించదు. ఎందుకంటే, పరోక్ష విధానం ఉంటే వార్డుల్లో సీట్లు తగ్గినా, సర్పంచ్ లేదా కౌన్సిలర్లను లొంగదీసుకుని మున్సిపాలిటీలు, జడ్పీలను కైవసం చేసుకునే వెసులుబాటు అధికారంలో ఉన్న పార్టీకి ఉంటుంది. అయితే, అక్రమ మార్గాల్లో పీఠాలను దక్కించుకునే సంస్కృతి కంటే, పారదర్శకమైన ప్రజా తీర్పుకే ప్రాధాన్యత ఇవ్వాలనేది సీఎం చంద్రబాబు వ్యూహంగా కనిపిస్తోంది. పరోక్ష ఎన్నికల్లో జరిగే కోట్లాది రూపాయల బేరసారాలకు స్వస్తి పలికితే, స్థానిక సంస్థల్లో జవాబుదారీతనం పెరుగుతుందనేది నమ్మకం. గత చరిత్రను పరిశీలిస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో తొలిసారిగా మున్సిపల్ చైర్మన్లు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులకు నేరుగా ప్రజలే ఓటు వేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2000వ దశకం ప్రారంభంలో చంద్రబాబు హయాంలోనూ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను నేరుగా ఎన్నుకునే పద్ధతి నడిచింది. అయితే, కౌన్సిల్‌లో ఒక పార్టీకి మెజార్టీ ఉండి, మేయర్, చైర్మన్ మరొక పార్టీకి చెందినవారు గెలిస్తే పాలనలో ప్రతిష్టంభన ఏర్పడుతోందనే నెపంతో తర్వాతి ప్రభుత్వాలు మళ్లీ పరోక్ష విధానానికే మొగ్గు చూపాయి.చట్టపరమైన కోణంలో చూస్తే.. భారత రాజ్యాంగంలోని 243అ పంచాయతీలు, 243ఖీ మున్సిపాలిటీలు నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల అధ్యక్షుల ఎన్నికల విధానాన్ని నిర్ణయించే సర్వాధికా రాలు రాష్ట్ర శాసనసభలకే ఉన్నాయి. దీనికోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994 , అలాగే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం-1965, మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం-1994లకు అసెంబ్లీలో సవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత కూటమికి అసెంబ్లీలో అత్యధిక మెజార్టీ ఉన్నందున, ఈ చట్టసవరణ చేయడం ప్రభుత్వానికి సునాయాసమ్మైన ప్రక్రియే కానుంది. ఈ ప్రత్యక్ష విధానం అమల్లోకి వస్తే రాజకీయ పార్టీలపై, స్థానిక నాయకత్వంపై తీవ్ర ప్రభావం పడనుంది. కేవలం డబ్బు సంచులతో కౌన్సిలర్లను కొనుగోలు చేసే ధనస్వామ్య నాయకులకు కాలం చెల్లి, ప్రజల్లో మంచి గుర్తింపు, ఆమోదయోగ్యత ఉన్న నాయకులకే పార్టీలు బీ-ఫారాలు ఇవ్వాల్సి వస్తుంది. ఒక వేళ కౌన్సిల్‌లో ప్రతిపక్షాల బలం ఎక్కువగా ఉన్నా, ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన మేయర్, చైర్మన్ బడ్జెట్ ఆమోదం, పాలనా నిర్ణయాల్లో అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అధికారంలో ఉండి కూడా పరోక్ష లబ్ధిని వదులుకుని ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లడం అనేది ఒక రాజకీయ తెగువగా అభివర్ణించవచ్చు. ఈ ప్రతిపాదన గనుక చట్ట రూపం దాల్చి అమల్లోకి వస్తే, భవిష్యత్తులో దేశంలోని ఇతర రాష్ట్రా లకు కూడా ఆంధ్రప్రదేశ్ స్థానిక పాలనలో మార్గదర్శిగా నిలిచే అవకాశాలు

# పాలకులారా....మమ్మల్ని పట్టించుకోండి...!

- చిన్నారుల ప్రాణాలకు భరోసా కావాలి..
- జాతీయ అరుదైన వ్యాధుల సహాయ నిధి అత్యవసరం
- శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి
- డబ్బు లేక చికిత్స ఆగకూడదు.. చిన్నారుల ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదు



**అనంతపురం - సూర్య వాస్తవం ప్రత్యేక కథనం**

ఒక కుటుంబంలో చిన్నారికి అరుదైన వ్యాధి ఉందని తెలిసిన క్షణం నుంచే వారి జీవితంలో అనిశ్చితి మొదలవుతుంది. వ్యాధితో పోరాడటమే కాకుండా, చికిత్స కోసం కోట్ల రూపాయలు సమకూర్చాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎస్ఎంఏ (స్పినల్ మస్క్యులర్ అట్రోఫీ ), డీఎండీ (దుచేన్నే మస్క్యులర్ డేస్ట్రోఫీ ) వంటి అరుదైన వ్యాధుల చికిత్స అత్యంత ఖరీదైనది కావడంతో అనేక కుటుంబాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

ప్రస్తుతం తల్లిదండ్రులు సోషల్ మీడియా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ప్రింట్ మీడియా, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థి సంఘాలు, దాతల సహకారంతో నిధులు సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ వ్యాధుల చికిత్సలో సమయం అత్యంత కీలకం. నిధుల సేకరణలో ఆలస్యం జరిగితే చిన్నారుల ఆరోగ్యం మరింత విషమించి, ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం ఉంది. ఒక చిన్నారి ప్రాణం ప్రజల విరాళాలపై ఆధారపడే పరిస్థితి రావడం బాధాకరం. రూ.16--17 కోట్ల వరకు అవసరమయ్యే చికిత్స కోసం నెలల తరబడి విరాళాలు సేకరించాల్సి వస్తోంది. ఆలోపు విలువైన సమయం కోల్పోయి చిన్నారుల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితిలో తల్లిదండ్రులు అనుభవించే




మానసిక వేదనను మాటల్లో చెప్పలేం. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి "జాతీయ అరుదైన వ్యాధుల సహాయ నిధి" ఏర్పాటు చేయడం అత్యవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్ ) నిధులు, ప్రజల స్వచ్ఛంద విరాళాలను ఒకే వేదికపై సమీకరించి, అర్హులైన చిన్నారులకు తక్షణ ఆర్థిక సహాయం అందించే పారదర్శక వ్యవస్థను రూపొందించాలి. అదే విధంగా దేశవ్యాప్తంగా అరుదైన వ్యాధుల నమోదు, నవజాత శిశువులకు ముందస్తు స్క్రీనింగ్, వేగవంతమైన నిర్ధారణ, ప్రత్యేక వైద్య కేంద్రాల ఏర్పాటు, చికిత్స అందించే ఆసుపత్రుల సంఖ్య పెంపు, ప్రాణాలను కాపాడే మందులు అందుబాటు ధరల్లో లభించేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దేశ భవిష్యత్తు అయిన చిన్నారుల ప్రాణాలను కాపాడటం ప్రభుత్వాల తొలి బాధ్యత. డబ్బు లేక చికిత్స ఆగిపోకూడదు. ఏ తల్లిదండ్రులూ తమ బిడ్డ ప్రాణం కోసం విరాళాల కోసం వేడుకునే పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారాన్ని అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రభుత్వాలు ప్రతి ఏడాది సంక్షేమ పథకాల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. అదే విధంగా ప్రాణాపాయంలో ఉన్న అరుదైన వ్యాధులతో బాధపడే చిన్నారుల చికిత్స కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, అత్యవసర సహాయం అందించే విధానాన్ని రూపొందించాలి.

ప్రతి చిన్నారి చిరునవ్వు దేశ సంపద. వారి ప్రాణాలను కాపాడే "జాతీయ అరుదైన వ్యాధుల సహాయ నిధి" ఏర్పాటు ఇక ఆలస్యం కాకూడదు. ఈ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని "సూర్య వాస్తవం" ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాం.

# రాజకీయాలు అవినీతిమయం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రజలకే డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. నేటి రాజకీయాలు పూర్తిగా భ్రష్టుపట్టాయని, నిజాయతీకి చోటు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు సిద్ధరామయ్య వివరించారు. మాండ్య జిల్లా కేఆర్ పేటలో శనివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేయగా, ఆ తర్వాత తన నిర్ణయాన్ని వివరిస్తూ ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

**'ఆ సంతృప్తి నాకు ఉంది'**

కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు సిద్ధరామయ్య మే 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం డీ.కే. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే, రాజీనామా అనంతరం కాంగ్రెస్ అధిష్ఠానం ఆఫర్ చేసిన రాజ్యసభ సీటును తాను సున్నితంగా తిరస్కరించానని సిద్ధరామయ్య చెప్పారు. తాను 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించానని, విజయాలు, ఓటములు రెండింటినీ చూశానని పేర్కొన్నారు. కానీ, తాను నమ్మిన సూత్రాలకు విరుద్ధంగా ఎప్పుడూ ప్రవర్తించకపోవడం, అంతరాత్మకు ద్రోహం చేయకపోవడం అనే సంతృప్తి ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా, కొన్ని నెలల క్రితం సిద్ధరామయ్య స్వచ్ఛందంగా కర్నా టక సీఎం పదవి నుంచి వైదొలిగారు. అనంతరం ఆయన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా నియమిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**మంత్రివర్గ విస్తరణ - ఢిల్లీకి సీఎం**

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సమయం ఆసన్నమవుతున్న వేళ ముఖ్యమంత్రి డీకే శివకు మార్ సోమవారం దిల్లీకి బయలుదేరనున్నారు. అక్కడ పార్టీ పెద్దలతో సమావేశమై మంత్రివర్గ విస్తరణకు పచ్చజెండా ఊపే అవకాశం ఉంది. కర్నా టక భవన్‌లో కేంద్ర మంత్రులు, కర్నా టకకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలతో సమావేశం కానున్నారు. అనంతరం, పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణకు అనుమతి కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై రాహుల్ గాంధీతో చర్చించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి.

అయితే, మంత్రి పదవి కోసం కొంతమంది ఎమ్మెల్యేలు చివరి నిమిషంలో లాబీయింగ్ చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారని సమాచారం. ఇందుకోసం దిల్లీకి పయనమయినట్లు సమాచారం. కాగా, గత వారం, నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించి రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ఆందోళన కారణంగా, ముఖ్యమంత్రి డీకే, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్ మంత్రివర్గ విస్తరణపై చర్చించలేకపోయారు. ఇప్పుడు నీట్ పోరాటం ముగిసింది కాబట్టి, రాహుల్ గాంధీతో కలిసి మంత్రివర్గ విస్తరణకు అనుమతి పొంది, మంత్రుల జాబితాను ఖరారు చేసే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి. మంత్రివర్గ విస్తరణ ఏ క్షణంలోనైనా జరగవచ్చని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇప్పటికే స్పష్టం చేశారు.

# దేశ భవిష్యత్‌కు యువశక్తే పునాది

(మొదటిపేజీ తరువాయి)

తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. జాతీయ మీడియా ప్రతినిధులు ఆదివారం హైద రాబాద్‌లో ఆయనను కలిసిన సందర్భంలో పలు విషయాల పై స్పందించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న యువతకు, అదేస్థాయిలో రాజకీయ వ్యవస్థలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇటీవల నిర్వహించిన సీబీఎస్ఈ, నీట్, నెట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులను సమీక్షించడంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. నేటి యువత 21 ఏండ్ల వయస్సులోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా సేవలందిస్తోందని, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తోందన్నారు.

ప్రపంచస్థాయి సంస్థలకు సైతం నాయకత్వం వహిస్తోందని వెల్లడించారు. సాంకేతిక, పరిపాలనా, వ్యాపార రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్న యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏండ్లకు తగ్గించిన విషయాన్ని, 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 21 ఏండ్లకు సవరించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 25 నుంచి 21 ఏండ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 30 నుంచి 25 ఏండ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించేందుకు ఆగస్టు నెలలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలను స్వీకరించిన అనంతరం పోటీ వయోపరిమితి తగ్గింపును కోరుతూ అధికారిక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, పార్లమెంట్ సీట్ల పెంపుదల, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితి తగ్గింపు అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్రను మరింత విస్తరించడం దేశ భవిష్యత్‌కు అవసరమని ఆయన తెలిపారు.

## 23 అడుగుల శ్రీ షిరిడి సాయిబాబా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

- ఆధ్యాత్మిక కేంద్రంగా బుక్కరాయసముద్రం అభివృద్ధి చెందాలని ఆకాంక్ష

- లక్ష్మీ పూజ, గోరింటాకు మహోత్సవంలో భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు



**శింగనమల - సూర్య వాస్తవం :** శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం చెరువు కట్టపై ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన 23 అడుగుల శ్రీ షిరిడి సాయిబాబా సజీవ శిల్ప విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సజీవ శిల్పాల రూపకర్త రాజేష్ అత్యంత అద్భుతమైన నైపుణ్యంతో ఈ సాయిబాబా విగ్రహాన్ని రూపొందించారని కొనియాడారు. షిరిడి అనంతరం భక్తులను విశేషంగా ఆకట్టుకునే స్థాయిలో సాయిబాబా సజీవ శిల్ప విగ్రహాన్ని బుక్కరాయ సముద్రంలో ప్రతిష్ఠించడం ఈ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ పుణ్యక్షేత్రం భవిష్యత్తులో భక్తులకు ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన లక్ష్మీ పూజ -- గోరింటాకు మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగాష్టకం పారాయణం, దేవీ ఖడ్గమాల పారాయణం, శ్రీ షిరిడి సాయిబాబా చాలీసా, అష్టలక్ష్మీ స్తోత్రం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులతో కలిసి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సాయిబాబాను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిరిడి సాయినాథ్ సేవా సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, శాశ్వత గౌరవ అధ్యక్షులు విజయనాథ్, ఇరిగేషన్ డీఈ రాజా, కన్వీనర్ లక్ష్మీనారాయణ, సింగిల్ విండో అధ్యక్షులు కేసన్న, నాయకులు శ్రీరామ్ రెడ్డి, జీసీ బాబు, పొడరాళ్ల రవీంద్ర, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో సాయిబాబా భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తప్పిపోయిన మహిళను 24 గంటల్లోనే గుర్తించిన పోలీసులు

- సిసిటివి 360' ద్వారా ఆచూకీ లభ్యం
- కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగింత
- పెద్దపప్పూరు పోలీసుల వేగవంతమైన చర్యలకు జిల్లా ఎస్పీ ప్రశంసలు




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ఇంటి నుంచి కనిపించకుండా పోయిన ఓ మహిళను పెద్దపప్పూరు పోలీసులు కేవలం 24 గంటల్లోనే గుర్తించి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన 'సిసిటివి 360' సాంకేతికతను వినియోగించి మహిళ ఆచూకీని గుర్తించడం విశేషం. పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామానికి చెందిన గాలి విజయలక్ష్మి (52) ఈ నెల 24న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయి కనిపించకుండా పోయారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో 25న పెద్దపప్పూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా 'సిసిటివి 360' అప్లికేషన్ ద్వారా సేకరించిన సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా, మహిళ కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మహిళను సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళను క్షేమంగా గుర్తించి అప్పగించిన పెద్దపప్పూరు పోలీసుల వేగవంతమైన చర్యలను జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం వల్ల మిస్సింగ్ కేసును తక్కువ సమయంలో ఛేదించగలిగామని పోలీసులు తెలిపారు.

## మెగా యూత్ ఫోర్స్ అనంతపూర్ జిల్లా జాయింట్ కన్వీనర్‌గా గుత్తి బ్రహ్మయ్య




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి హైదరాబాద్‌లోని చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌లో జరిగిన కార్యక్రమంలో బోయగడ్డ బ్రాహ్మయ్యక మెగా యూత్ ఫోర్స్ అనంతపూర్ జిల్లా జాయింట్ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించడం జరిగింది .మెగా యూత్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుస్మిత కొణిదెల, జాతీయ కన్వీనర్ బాబీయెడిద జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యుల సమక్షంలో ఈ బాధ్యతను అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. మన అనంతపూర్ జిల్లాలో మెగా యూత్ ఫోర్స్ బలోపేతానికి, సేవా కార్యక్రమాలకు నా వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని తెలియజేస్తున్నాను అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఎకరాల్లో

# పండ్ల తోటల కార్యక్రమానికి శ్రీకారం

- కె.కె.అగ్రహారంలో 202 మామిడి మొక్కలు నాటిన ఎమ్మెల్యే బండారు శ్రావణి



**బుక్కరాయసముద్రం - సూర్య వాస్తవం :** వీబీజీ రామ్ జి ఉపాధి హామీ కార్యక్రమంలో భాగంగా బుక్కరాయ సముద్రం మండలం కె.కె. అగ్రహారం గ్రామపంచాయతీ పరిధిలోని లబ్ధిదారురాలు శ్రీమతి ఎల్.కె. సుధ మామిడి తోటలో ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆదివారం 202 మామిడి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 50 వేల ఎకరాల్లో పండ్ల మొక్కల నాటే మహత్తర కార్యక్రమం ప్రారంభం కావడం ఎంతో సంతోషకరమని అన్నారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని, గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం పురోగమిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక వినూత్న కార్యక్రమా లను అమలు చేస్తోందని తెలిపారు. పండ్ల తోటల అభివృద్ధికి గుంతలు తీయడం నుంచి మొక్కల నాటడం, ఎరువులు, సంరక్షణ, నీటిపారుదల వరకు అవసరమైన ఖర్చులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. అదేవిధంగా తోటల నిర్వహణ కోసం రెండు నుంచి మూడు సంవత్సరాల పాటు ఎకరానికి సుమారు రూ. 1 లక్ష నుంచి రూ. 2.50 లక్షల వరకు సహాయం అందించడం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పండ్ల తోటలు పూర్తిస్థాయిలో దిగుబడి ఇచ్చే దశకు చేరుకున్న తర్వాత ప్రతి ఎకరానికి సంవత్సరానికి రూ. 80 వేల నుంచి రూ. 1 లక్ష వరకు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీంతో రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా మరింత బలోపేతం అవుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎంపీపీ సునీత, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు అదినారాయణ, మండల సింగిల్ విండో అధ్యక్షులు కేసన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవి, మండల నాయకులు ఓబులపతి, రాము, ఈశ్వరయ్య, జొన్న రామయ్య, పెద్దప్ప, గోవింద్ రెడ్డి, నారాయణస్వామి, గోపాల్, ఇతర కూటమి నాయకులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గుత్తిలో బీజేపీ కార్యవర్గ సమావేశం

- హాజరైన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవి రెడ్డి లక్ష్మీదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు పామిశెట్టి నాగరాజు



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం ఆర్ అండ్ బి బంగ్లాలో గుత్తి రూరల్, అర్బన్ భారతీయ జనతా పార్టీ మండల కార్య వర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం గుత్తి రూరల్ మండలాధ్యక్షుడు పాలమూరు బాబయ్య రాయల్ అర్బన్ మండల అధ్యక్షుడు బీసీ వెంకప్ప ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అర్బన్ మండల ఇన్చార్జిగా సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవి రెడ్డి లక్ష్మీదేవి, రూరల్ మండలం ఇన్‌ఛార్జి జిల్లా ఉపాధ్యక్షులు పాంశెట్టి నాగరాజు విచ్చేశారు. అదేవిధంగా గుంతకల్ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ కొలిమి రామాంజనేయులు, ఈ కార్యక్రమాని కి విచ్చేశారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి గుత్తి అర్బన్ ఇంచార్జ్ దేవి రెడ్డి లక్ష్మీదేవి, మాట్లాడుతూ గుత్తి అర్బన్ మం డల కమిటీ విధి వి ధానాల గురించి కమిటీ యొక్క సభ్యుల గురించి శక్తి కేంద్రాలు పోలింగ్ బూత్ నిర్వహణ గురించి న రేంద్ర మోడీ 12 సంవత్సరాలు సుపరిపాలన గు రించి వివరించడం జరిగిం ది.అదేవిధంగా రూరల్ ఇ న్చార్జ్ పాంశెట్టి నాగరాజు మాట్లాడుతూ మండల కమి టీ యొక్క నిర్వహణ విధి విధానాలు వివరించారు.అ దే విధంగా కొలిమి రామాం జనేయులు కూడా సార్ స్టేటస్ గురించి వి వరించడం జరిగింది.అలాగే ఈరోజు మండల అధ్యక్షుడు పాలమూరు బాబయ్య రాయల్ ఆధ్వర్యంలో నూత న చేరికలు చేయడం జరిగిం ది.చేరిన వారిలో గుత్తి మండలం బసిన్నెపల్లి గ్రామానికి చెందిన భాస్కర్,తిమ్మప్ప, సుధాను పార్టీ కండువా క ప్పి పార్టీలకు సాధారణంగా ఆహ్వానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధా న కార్యదర్శిలు నూర్ హస న్ భాష,చామంతుల ప్రేమ్ కుమార్,రాష్ట్ర కౌన్సిల్ నెంబ ర్ డిబి రంగరాజు,సీనియర్ నాయకులు విశ్వకర్మ,ఇంప్లి మెంట్ మెంబర్ కెఎం వీరోజీ రావు,జిల్లా కార్యదర్శులు క వితా శర్మ,బల్క నారాయణ రెడ్డి, జిల్లా విపత్తుల నిర్వహ ణ సెల్ కన్వీనర్ మూలింటి బాలకృష్ణ,జిల్లా టీచర్ సెల్ కన్వీనర్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి,పబ్లిసిటీడ ప్రింటింగ్ జిల్లా కన్వీనర్ రొయ్యల నారాయణ, జాతీయ సబహిత్వ అభియాన్ జిల్లా కన్వీనర్ ఆకుల శ్రీనివాస్,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కరీం,జిల్లా కార్యవర్గ సభ్యు లు నాగేపల్లి, లక్ష్మయ్య, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి లక్ష్మణ్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు పాలమూరి చంద్రశేఖర్, పట్టణ ఉపాధ్యక్షులు ప్రసాద్, రమణ, మాణిక్యం ఆచారి, పట్టణ కార్యదర్శి శైలజ, శ్రీనివాసులు,పట్టణ ట్రెజరర్ బి వరప్రసాద్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు కందుల యములత,పట్టణ ఓబీసీ అధ్యక్షులు వై.జానకిరామ్, బీజేవైఎంపట్టణ అధ్యక్షుడు వసంత్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు చిరంజీవి, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఓం ప్రకాష్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు మనోహర్, మైనార్టీ మోచ పట్టణ అధ్యక్షుడు వల్లి భాషా, సీనియర్ నాయకులు రామాంజనేయులు, తురకపల్లి, పవన్, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం తగదు

- ఘటనలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలి
-- వైఎస్ఆర్ విద్యార్థి విభాగం
- పోలవరం, అనకాపల్లి ఘటనలపై ఆందోళన వ్యక్తం చేసిన మంజునాథ్ రెడ్డి
- అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్



**కూడేరు - సూర్య వాస్తవం :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలో ఆహార నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. పోలవరం జిల్లా సోముల గూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 41 మంది, అనకాపల్లి జిల్లా కోటవురట్ల కేజీబీవీలో 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పేర్కొంటూ, విచారణలో నిర్లక్ష్యం బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు:**

- రెండు ఘటనలపై ఉన్నతస్థాయి స్వతంత్ర విచారణ చేపట్టాలి.
- అస్వస్థతకు గురైన విద్యార్థినులందరికీ అత్యుత్తమ వైద్య చికిత్స అందించాలి.
- రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో ఆహార నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి
- నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన ఆహార భద్రతా వ్యవస్థను అమలు చేయాలి.
- విద్యార్థుల ప్రాణాలు అమూల్యమైనవని, ప్రభుత్వం ఈ ఘటనలను అత్యంత బాధ్యతతో తీసుకుని విద్యార్థుల భద్రతకు పూర్తి హామీ ఇవ్వాలని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, చంద్రశేఖర్, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం 'ప్రజలతో కమీషనర్ ముఖాముఖీ'

**ప్రొద్దుటూరు- సూర్య వాస్తవం:** ఈనెల 27 వ తేదీ సోమవారం నుండి సమయం ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు ఒక గంట సమయం ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి ప్రజలతో కమీషనర్ ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. **ఫిర్యాదు దారులు ఫోన్ చేయవల్సిన నంబర్స్: 9247563385/ 9849905863**




ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మున్సిపాలిటీ సేవలను ప్రజలకు మరింత చేరువుగా తీసుకెళ్లడం, దివ్యాంగులు, వయో వృద్ధులు, మహిళలు, చదువుకుంటున్న విద్యార్థులు, ఆరోగ్యం సహకరించలేనివారు, దూర ప్రాంతాలలో ఉన్న మన ప్రొద్దు టూరు పట్టణ ప్రజలు కోసం ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇది ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అనుబందంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. 'టైం లైన్' ప్రకారం సమస్యలను సంబంధిత శాఖా అధికారులు ఫోన్ ద్వారా నమోదు చేసుకున్న సమస్యలు పరిష్కరించినా ఒక విధంగా సత్వర పరిష్కారం కోసం ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందని అధికారుల జవాబుదారితనం, పారదర్శకత కోసం, సత్వర పరిష్కారం కోసం ప్రొద్దుటూరు మున్సిపాలిటీ చేయగలిగిన సమస్యలను మాత్రమే ఫిర్యాదులుగా నమోదు చేయబడతాయని వివరించారు. మున్సిపల్ కమీషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్, శానిటేషన్ సూపర్ వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, రెవిన్యూ ఆఫీసర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, మెప్మా సెక్షన్ హెడ్, పిజిఆర్ఎస్ సెక్షన్ సిబ్బంది పర్యవేక్షణలో ఫోన్ ద్వారా నమోదైన ఫిర్యాదులు అదేరోజు సంబంధిత శాఖా అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ సోమవారం ఈ ఫిర్యాదులపై సమీక్షా జరుగుతుందని, కమీషనర్ నేరుగా ఈ సమస్యలు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. సమస్యలు ఉన్న ఫిర్యాదు దారుడు ఫోన్ చేసి ఫిర్యాదు దారుడు పేరుబి అడ్రస్బి సెల్ / ఫోన్ నెంబర్బి సమస్య వివరణ వంటి వివరాలు తెలపాలని కోరారు. ప్రొద్దుటూరు పట్టణ ప్రజలు అందరు సత్వర పరిష్కారం కోసం ఫోన్ ద్వారా సమస్యలు నమోదు చేసుకోమని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు మేరకు ఫిర్యాదులు పరిష్కరించాబడతాయని సంబంధిత అధి కారులకు సమాచారం అందించగలరని సూచించారు. ప్రొసీడింగ్స్ తయారు చేసి బట్వాడ చేసి రసీదు పొందగలరని తెలిపారు.

# జైబీసీ నినాదాలతో మారుమోగిన బ్రహ్మంగారిమఠం

**- బీసీల ఐక్యతే సామాజిక, రాజకీయ సాధికారతకు బాట: బీసీ రమణ**

**- కడప విమానాశ్రయానికి శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నామకరణం చేయాలి**

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని పట్రా నాయుళ్ల అన్నదాన సత్రంలో జాతీయ బీసీ చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశానికి జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపకులు బీసీ రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు, వివిధ బీసీ కులాల నాయకులు, మహిళా బీసీ ప్రతినిధులు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీ రమణ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని బీసీ కులాలు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధే జాతీయ బీసీ చైతన్య సమితి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ఆయన పలు కీలక డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లారు. వాటిలో కడప విమానాశ్రయానికి శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి పేరు నామకరణం చేయాలి- చట్టసభల్లో బీసీలకు



తగిన రిజర్వేషన్ కల్పించాలి. బీసీల సామాజిక రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి- రాష్ట్ర, జాతీయ స్థాయిలో సమగ్ర బీసీ కులగణన నిర్వహించాలి- అసెంబ్లీ, శాసన మండలి, రాజ్యసభ వంటి ప్రజాప్రతినిధ్య వ్యవస్థల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, రుణాలు, పరిశ్రమలు, సంక్షేమ పథకాల్లో బీసీలకు ప్రత్యేక రాయితీలు అందించాలి స్థానిక సంస్థల నుంచి పార్లమెంట్ వరకు బీసీల రాజకీయ సాధికారతను పెంపొందించే చర్యలు చేపట్టాలి. ఈ సమావేశంలో జాతీయ బీసీ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు రాజా, వివిధ బీసీ కులాల నాయకులు ప్రసంగిస్తూ బీసీలంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం పాల్గొన్న వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జానపద సాంస్కృతిక ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారుడు తమ్మిశెట్టి సుబ్బరాయుడు, సుభద్రమ్మ, బీసీ నాయకులు రామానాయుడు, మాధవ నాయుడు, పూజా శివయ్య యాదవ్, మేకల సుధాకర్, మాజీ ఎంపీపీ చక్రవర్తి, ఆవుల దస్తగిరి, బోల శ్రీనివాసులు, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పూర్వపు మఠాధిపతి శ్రీ వీరభద్ర స్వామి, పూర్వపు మఠాధిపతి కుమారుడు వీరంభట్లయ్య స్వామి, శ్రీ ఈశ్వరీ దేవి మఠం గోవిందస్వామి, జిల్లా కార్యదర్శి నరసింహ గౌడ్, రామయ్య (మాజీ విలేకరి) మల్లె బాలకృష్ణ, ఇటుకల ప్రసాద్ గౌడ్, గురవయ్య, రెడ్ల దిన్నె నాగ ఖాదరయ్య, రెడ్ల దిన్నె సురేంద్ర, రాళ్లపాటి చిన్న మస్తాన్, సన్నపురి శీను, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సభా ప్రాంగణం అంతా "జై బీసీ... జై బీసీ..." నినాదాలతో మారుమోగి, బీసీల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.




# 16 క్రికెట్ జట్లకు రూ.20 లక్షల విలువగల జెర్సీలు వితరణ




**కదిరి - సూర్య వాస్తవం :** భారత ప్రఖ్యాత అధ్యాపకులు సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా కదిరి ఎన్ వై పిఎస్ఎన్ వ్యవస్థాపకులు నిస్సార్ యాసిన్ ఆర్థిక సౌజన్యంతో కదిరి ఫ్రెండ్లీ క్రికెట్ జిల్లా టోర్నమెంట్ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ టి ఎస్ ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో జరగబోవు కదిరి మండలం ఉపాధ్యాయ క్రికెట్ టోర్నమెంట్ రెండవ ఆదివారం ఘనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డిఇఓ జాన్ రెడ్డప్ప మరియు కదిరి మండల విద్యాశాఖ అధికారి చెన్న కృష్ణ, విశ్రాంతి ఉపాధ్యాయులు ఖాదర్ వలీ కార్యక్రమానికిఏ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు, ఈ సందర్భంగా నిస్సార్ యాసిన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యా బోధనతో పాటు శారీరిక దృఢత్వం, క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం, తదుపరి శిక్షణతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు, క్రీడలు పట్ల ఏకాగ్రతను పెంపొందించేందుకు అలాగే క్రీడ మైదానంలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు అవసరముగా దోహదపడతాయని తెలియజేశారు, వారందరికీ అవసర మైనటువంటి జెర్సీలను వితరణ చేయడం చాలా సంతోషకరమని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి, ఇలాంటి ఏకరూప దుస్తులు వితరణకు సహకరించిన ఉపాధ్యాయ



సంఘాలకు ఆయన వినమ్రంగా స్వాగతించారు, అనంతరం ఉపాధ్యాయ సంఘాలు స్పందిస్తూ విద్య, ఉపాధ్యాయుల పట్ల స్పందిస్తున్న నాసిర్ యాసిన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, మొదటి మ్యాచ్ లో గోరంట్ల జుట్టుపై కదిరి ఏ జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొందింది , మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా భార్గవ కు నిస్సార్ యాసిన్ అందజేశారు అనంతరం రెండు మ్యాచ్లో ఎన్పి కుంట మండలం జట్టు పై ఉపాధ్యాయులు రొద్దం జట్టు ఐదు వికెట్లు తేడాతో గెలుపొంది ,మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నరేష్ అవార్డును అందుకున్నారు, ఈ క్రీడలో కమిటీ సభ్యులు కుంచపు శ్రీనివాసులు, రుద్రమ రెడ్డి, ఆజం భాష, లక్ష్మీనారాయణ రెడ్డి, అశ్విత, శంకర్, నారాయణ, రబ్బాని, మహేంద్ర, 16 మండలాల ఉపాధ్యాయ క్రికెట్ జట్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## రౌడీషీటర్లు, పాత నేరస్థులకు పోలీసుల ప్రత్యేక కౌన్సెలింగ్

**- సత్ప్రవర్తనతో సమాజంలో గౌరవంగా జీవించాలని సీఐ యువరాజు సూచన - నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ సహా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక - శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై నిరంతర నిఘా కొనసాగుతుందన్న పోలీసులు**




**పుట్టపర్తి క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్లు, పాత నేరస్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ యువరాజు మాట్లా డుతూ చట్టాన్ని గౌరవిస్తూ శాంతియుత జీవనం సాగించాలని, ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని సూచించారు. నేరాలకు పాల్పడినట్లయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసు కోవడంతో పాటు, అవసరమైతే పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. కుటుంబ సభ్యులతో కలిసి గౌరవప్రదమైన జీవితం గడుపుతూ ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, సమాజంలో మంచి గుర్తింపు పొందేలా సత్ప్రవర్తనతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై పోలీసుల నిరంతర నిఘా కొనసాగుతుందని, ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని సీఐ యువరాజు స్పష్టం చేశారు.

## బీసీ చైతన్య సమితి మండల అధ్యక్షుడిగా మల్లె బాలకృష్ణ ఏకగ్రీవ ఎన్నిక



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని స్థానిక పట్రా నాయుళ్ల అన్నదాన సత్రంలో ఆదివారం జాతీయ బీసీ చైతన్య సమితి మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ, జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారిమఠం మండల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా ఎద్దులాయపల్లె గ్రామానికి చెందిన మల్లె బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు మల్లె బాలకృష్ణ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తానని తెలిపారు. మండలంలోని ప్రతి బీసీ సోదరుడికి అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాతీయ, జిల్లా, మండల స్థాయి నాయకులు, బీసీ చైతన్య సమితి సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీలో కలకలం.. మునివర్ధన్ రెడ్డిపై వేటు

**- పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలతో సస్పెన్షన్.. ప్రాథమిక సభ్యత్వం కూడా రద్దు- పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలపై కఠిన నిర్ణయం- గ్రూపు రాజకీయాలు, ప్రజలను మోసం చేశారనే ఆరోపణలు- పార్టీ పేరుతో అధికారులను ప్రభావితం చేసే ప్రయత్నాలపై మండిపడ్డ టీడీపీ నాయకత్వం**

**పెళ్లకూరు-సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండల రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. అర్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిల్లకూరు మునివర్ధన్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అధికారిక ప్రకటన విడుదల చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించడం, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులను పార్టీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. సంచి కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరిన మునివర్ధన్ రెడ్డి, పార్టీ బలోపేతం కోసం పనిచేయాల్సిన సమయంలో వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ వివాదాస్పద రాజకీయాలకు కేంద్రబిందువుగా మారారని ఆరోపించారు. గ్రామంలో పార్టీ శ్రేణులను ఐక్యంగా నడిపించాల్సింది పోయి, గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ పార్టీ కార్యకర్తల మధ్య విభేదాలు సృష్టించే విధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. అంతేకాకుండా, టీడీపీలో కొనసాగుతూనే ప్రత్యర్థి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ఈ చర్యలు పార్టీ క్రమశిక్షణను దెబ్బతీయడమే కాకుండా కార్యకర్తల్లో అయోమయాన్ని సృష్టించాయని ఆయన పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానంటూ నమ్మించి, తమకు అధికార వర్గాల్లో పలుకుబడి ఉందని చెప్పి కొంతమంది నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు కూడా వచ్చినట్లు సంచి కృష్ణయ్య తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని దుర్వినియోగం చేస్తూ పార్టీ పేరును వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించుకున్నారని ఆయన ఆరోపించారు. అదేవిధంగా, పార్టీ పేరును అడ్డం పెట్టుకొని ప్రభుత్వ అధికారులను భయభ్రాంతులకు గురిచేయడం, ఒత్తిళ్లు తీసుకురావడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు కూడా పార్టీ నాయకత్వానికి అందినట్లు తెలిపారు. ఈ వ్యవహారాలన్నింటిపై పార్టీ పెద్దలతో చర్చించి, అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలించిన అనంతరం అధిష్ఠానం ఆదేశాల మేరకు మునివర్ధన్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు ఆయన ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి రాజీ ఉండదని, పార్టీ క్రమశిక్షణకు విఘాతం కలిగించే చర్యలను నాయకత్వం ఏమాత్రం సహించబోదని సంచి కృష్ణయ్య హెచ్చరించారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలు, విలువలు, నాయకత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సస్పెన్షన్ నిర్ణయం పెళ్లకూరు మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అర్లపాడు గ్రామంతో పాటు మండల వ్యాప్తంగా ఈ పరిణామంపై రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది.

## ఆరోపణలను ఖండించిన టీడీపీ నాయకుడు- మునివర్ధన్ రెడ్డి



**పెళ్లకూరు- సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం లోని ఆర్లపాడు గ్రామానికి చెందిన ముని వర్షన్ రెడ్డి నీ తెలుగుదేశం పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసినట్లు మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య చేసిన ప్రకటనపై చిల్లకూరు మునివర్ధన్ రెడ్డి స్పందించారు. తనపై చేసిన ఆరోపణలన్నీ పూర్తిగా నిరా ధారమైనవని, వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మునివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. "నాపై చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదు. నేను అర్లపాడు గ్రామానికి వెళ్లి నెల రోజులకు పైగానే అయింది. అలాంటప్పుడు గ్రామంలో గ్రూపు రాజకీయాలు చేయడం, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం, అధికారులను బెదిరించడం వంటి ఆరోపణలు ఎలా వస్తాయి?" అని ప్రశ్నించారు. "నేను ఎక్కడైనా ఇలాంటి పనులకు పాల్పడ్డానని నిరూపిస్తే, ఎక్కడికైనా వచ్చి ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నాను. నాపై ఎలాంటి ఫిర్యాదు వచ్చిందని గానీ, ఆరోపణలు ఉన్నాయని గానీ పార్టీ నాయకత్వం నుంచి ఎవరూ నన్ను వ్యక్తిగతంగా పిలిచి వివరణ కోరలేదు. కనీసం ఫోన్లో కూడా సంప్రదించకుండా ఒక్కసారిగా నాపై ఇలాంటి దుష్ప్రచారం చేయడం బాధాకరం" అని ఆయన అన్నారు. ఈ అంశాన్ని సోమవారం సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లి పూర్తి వివరాలు తెలియజేస్తానని మునివర్ధన్ రెడ్డి వెల్లడించారు. పార్టీ పెద్దలను కలిసి తన వాదనను వినిపించి, జరిగిన పరిణామాలపై చర్చిస్తానని తెలిపారు.

## తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు

**- ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ - ఉచిత మంచినీటి ట్యాంకర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే.- సొంత నిధులతో రెండు ట్యాంకర్లు అందజేసిన - పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు అవసరమైన సమయాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా రెండు ఉచిత మంచినీటి ట్యాంకర్లను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ వైభవంగా ప్రారంభించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ తమ సామాజిక బాధ్యతగా, సొంత నిధులతో ఈ రెండు మంచినీటి ట్యాంకర్లను మున్సిపాలిటీకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ.. సూళ్లూరుపేట పట్టణంలో నీటి ఎద్దడి లేదా అత్యవసర పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఈ ట్యాంకర్ల ద్వారా ఉచితంగా తాగునీటిని అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను తొలగించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమాజ సేవలో భాగస్వామ్యమై ప్రజల కోసం ఉచితంగా ట్యాంకర్లను సమకూర్చిన పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీ.వీ.పట్టాభిరామ్ స్మారక పురస్కారం ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్





**దొరవారిసత్రం - సూర్య వాస్తవం** :రాష్ట్ర వైద్య, ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ హైదరాబాద్‌లో నిర్వహించిన బి.వి.పట్టాభిరామ్ స్మారక పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త,మాజీ డీఆర్‌డీవో ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సలహాదారు డా.జి.సతీష్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక బి.వి.పట్టాభిరామ్ స్మారక పురస్కారం అందించడం ప్రతి తెలుగు వాడికి గర్వకారణమని పేర్కొన్నారు. విజ్ఞాన శాస్త్రం,రక్షణ రంగం,సాంకేతిక ఆవిష్కరణల్లో ఆయన అందించిన విశిష్ట సేవలు యువతకు స్ఫూర్తిదా యకమని కొనియాడారు. స్వదేశీ రక్షణ సాంకేతికత అభివృద్ధి, భారత రక్షణ రంగ స్వావలంబన, ఆంధ్రప్రదేశ్‌కు అత్యాధునిక పెట్టుబడులు తీసుకురావడంలో డా.జి.సతీష్ రెడ్డి సేవలు విశేషమని పేర్కొన్నారు. ఇలాంటి మహనీయుల అనుభవం, మార్గదర్శకత్వం రాష్ట్రాభివృద్ధికి, యువతకు స్ఫూర్తినిస్తూ దేశప్రగతికి మరింత దోహదపడాలని ఆకాంక్షించారు.

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** శ్రీ సత్యసాయి (అనంతపూర్)జిల్లా తనకల్ మండలం కొక్కంటి క్రాస్"సత్యన్న సేన" సభ్యుల అధ్వర్యంలో ఆదివారం ఏడుగురు గర్భిణులకు ఆరు రకాల పౌష్టికాహారాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సత్యన్న సేన సభ్యులు మాట్లాడుతూ సత్యన్న సేన ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు కరోనా సమయంలో చేయడం. తరువాత కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, దానికి కొనసాగింపుగా వీరికి ప్రతి నెలా అమృత పౌష్టిక ఆహారాన్ని డెలివరీ అయ్యేవరకు అందజేయడం జరుగుతుంది. ప్రతి నెలా మా ప్రాంతం( మా దృష్టికి వచ్చిన) లో ఉన్న నిరుపేద గర్భిణులను గుర్తించి వారు గర్భం దాల్చినప్పటి నుండి నెలలు నిండేవరకు సత్యన్న సేన ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేయడం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి ప్రధాత అయిన సత్యకుమార్ యాదవ్ (రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి)కి ఆ ప్రాంత గర్భిణులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యన్న సేన సభ్యులు, గర్భిణులు పాల్గొన్నారు.




# అధైర్యపడొద్దు ప్రభుత్వం మీకు అన్ని విధాల అండగా ఉంటుంది

**- మంత్రి సత్య కుమార్ యాదవ్ భరోసా**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** అధైర్యపడొద్దు చికిత్స విషయంలో ప్రభుత్వం మీకు అన్ని విధాలుగా అండగా ఉం టుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆయన ఆదివారం అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు చెందిన ఆరేళ్ల చిన్నారి ఎస్ చంద్రికను హైదరాబాదులో ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీచార్జ్ సెంటర్‌కు వెళ్లి అందుతున్న వైద్యాన్ని పరిశీలించి అధికారులకు మెరుగైన వైద్యం అందించే విధంగా చూడాలని తెలిపారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువుకు చెందిన ఆరేళ్ల చిన్నారి ఎస్.చంద్రికకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ నిరంతరం ప్రత్యేక చొరవ చూపుతున్నారు. చిన్నారి ఆరోగ్య సమస్యపై సమాచారం అందిన వెంటనే జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేసి,చిన్నపిల్లల వైద్య నిపుణులు, నేత్ర వైద్యులు తదితరులతో కూడిన బృందాన్ని ఆమె ఇంటికి పంపించి ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. నిపుణుల సూచనల మేరకు వెంటనే తిరుపతిలోని రూయా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వ హించేలా చర్యలు తీసుకున్నారు. మరింత ఉన్నత స్థాయి చికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో, హైదరాబాద్‌లోని ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో చికిత్స అందేలా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఏర్పాట్లు చేశారు. ఆస్పత్రికి స్వయంగా వెళ్లి చిన్నారిని పరామర్శించి,ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సూచించారు. చిన్నారి చికిత్సకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా రూ 1,37,339 విలువైన వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే చికిత్సకు సంబంధించిన ఇతర అవసరాల కోసం ఆర్థిక సహాయం అందించడంతో పాటు పౌష్టికాహార కిట్‌ను అందజేశారు. చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడిన మంత్రి సత్యకుమార్ యాదవ్ "అధైర్యపడొద్దు చికిత్స విషయంలో ప్రభుత్వం మీకు అన్ని విధాలా అండగా ఉంటుంది" అంటూ భరోసా కల్పించారు.

## రాజ్యాంగ పరిరక్షణే ప్రజాస్వామ్య బలోపేతానికి మూలాధారం

**- బామ్‌సెఫ్ క్లస్టర్ సమావేశం ఘనంగా నిర్వహణ**
**- రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**




**నాయుడుపేట - సూర్య వాస్తవం:** భారత రాజ్యాంగాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మాత్రమే సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలు సుస్థిరంగా నిలుస్తాయని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు, బామ్‌సెఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆమవరపు మురళీకృష్ణ పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లో మరింత బలంగా చాటిచెప్పేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. బీఎస్--4 దేశవ్యాప్త మహాజన చైతన్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాయుడుపేట పట్టణంలోని ఎం.కె. గెస్ట్ ఇన్‌లో బామ్‌సెఫ్ క్లస్టర్ సమావేశాన్ని బామ్‌సెఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆమవరపు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, బహుజన సమాజ హక్కుల సాధన, ప్రజాస్వామ్య విలువల బలోపేతం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించే మహత్తర గ్రంథమని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి పౌరుడు అర్థం చేసుకుని దానిని ఆచరణలో అమలు చేసే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మూలనివాసి బహుజన సమాజానికి చెందిన ప్రజలను రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో బామ్‌సెఫ్ నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. బామ్‌సెఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆమవరపు మురళీకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహాజన చైతన్య కార్యక్రమం ద్వారా రాజ్యాంగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సామాజిక సమానత్వం సాధించడం, బహుజన వర్గాల హక్కులను పరిరక్షించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఒక్కరికీ చేరేలా సామాజిక ఉద్యమాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సమాజంలో రాజ్యాంగ విలువలు బలపడితేనే ప్రజాస్వామ్యం మరింత పటిష్ఠంగా నిలుస్తుందని, సామాజిక అసమానతలు తొలగి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. యువత రాజ్యాంగంపై పూర్తి అవగాహన పెంపొందించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బామ్‌సెఫ్ తిరుపతి జిల్లా ఇన్‌చార్జి ఇ. అల్లయ్య, ఏపీఎస్పీడీసీఎల్ డీఈటీ ప్రభాకర్, నాయుడుపేట జూనియర్ కళాశాల అధ్యాపకులు డా. కె. గురవయ్య, నాయుడుపేట బార్ అసోసియేషన్ నాయకులు పి. గంగాప్రసాద్, బామ్‌సెఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. వరప్రసాద్ రావు, ఎస్ఈసీ సభ్యులు టి. రమేష్, బామ్‌సెఫ్ నాయకులు పి. ఖాజా రహమతుల్లా, జె. పెంచలయ్య, బందిల మోహన్, జి.ఎ. సంపత్ బాబు, సిహెచ్. అల్లెయ్యతో పాటు బామ్‌సెఫ్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌కు ఘన సన్మానం

**- నాయుడుపేటలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా అభినందనలు**
**- పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని నాయకుల పిలుపు**



**నాయుడుపేట- సూర్య వాస్తవం :** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన బొల్లకాయల విజయ భాస్కర్కు నాయుడుపేట పట్ట ణంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వ హించారు. న్యాయవాది, బీజేపీ జిల్లా మాజీ కార్యదర్శి ఆశా చెంచు కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు విజయ భాస్కర్‌కు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బీజేపీ సీనియర్ నేత, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ రంగినేని కృష్ణయ్య మాట్లాడుతూ, కొద్దిమంది కార్యకర్తలతో ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ నేడు దేశవ్యాప్తంగా మహావృక్షంలా విస్తరించిందని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ సంస్థను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. న్యాయవాది, మాజీ జిల్లా కార్యదర్శి ఆశా చెంచు కృష్ణయ్య మాట్లాడుతూ, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు భారతీయ జనతా పార్టీలో సముచిత గుర్తింపు, గౌరవం లభిస్తాయని పేర్కొన్నారు. బొల్లకాయల విజయభాస్కర్ మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి పార్టీకి సేవలందించాలని ఆకాంక్షించారు. అలాగే రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొత్త బాధ్యతలు స్వీకరించిన ఆయన క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. సన్మానానికి స్పందించిన బొల్లకాయల విజయభాస్కర్, తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలందరితో కలిసి పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడు పి. రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు అమరావతి రామయ్య, సర్వారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గుంజి శ్రీనివాసులు, పుట్టు వీరయ్య, కొప్పోలు సుబ్రహ్మణ్యం, దువ్వూరు మధుసూదన్ రెడ్డి, వేణయ్య, ఓరింగం ఈశ్వరయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై రాళ్లబూదూగూరు పోలీసుల హెల్మెట్ అవేర్నెస్ ర్యాలీ

**శాంతిపురం- సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో శాంతిపురం మండలంలో రాళ్లబూదూగూరు పోలీసులు హెల్మెట్ అవేర్నెస్ క్యాంపెయిన్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుప్పం సబ్ డివిజన్ పోలీసు అధికారి బి. పార్థసారధి ఆధ్వర్యంలో శాంతిపురం మండలంలోని తులసి నాయన పల్లి మోడల్ స్కూల్ సమీపం నుండి ముల్లూరు కృష్ణాపురం క్రాస్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సుమారు 300 మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించి పాల్గొని రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు మాత్రమే కాకుండా వెనుక కూర్చునే ప్రయాణికులు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ప్రాణరక్షణ కవచమని, రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని సూచించారు. అదేవిధంగా కుప్పం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జే.మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను రక్షించుకోవచ్చని వివరించి, ప్రతి ప్రయాణంలో హెల్మెట్ ధరించడం అలవాటుగా మార్చుకోవాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాళ్లబూదుగూరు ఎస్ఐ ఐ. నరేష్,గుడుపల్లిఎస్ ఐ పి. శ్రీకాంత్, పోలీసు అధికారులు, సిబ్బంది మరియు సుమారు 300 మంది వాహనచోదకులు పాల్గొన్నారు. అలాగే హెల్మెట్ వినియోగాన్ని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో 30 మంది వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా రాళ్లబూదూగూరు పోలీసులు చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు అభినందించారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.





# 'మా అబ్బాయి వస్తున్నాడు.. ఆదరించండి'..!

## - జయకృష్ణ కోసం మహేశ్ బాబు ఎమోషనల్ అప్పీల్.. వీడియో వైరల్!



అన్న రమేశ్ బాబు కొడుకు జయకృష్ణ కోసం మహేశ్ బాబు ప్రచారం
'శ్రీనివాస మంగాపురం' సినిమాకు మద్దతుగా ప్రత్యేక వీడియో విడుదల
తన 'రాజకుమారుడు' రిలీజ్ డేట్‌నే అబ్బాయ్‌కి కుదిరిందంటూ ఆనందం

**జయకృష్ణను ఆదరించాలని తన అభిమానులను కోరిన సూపర్ స్టార్**

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో వెండితెరకు పరిచయం అవుతున్న వేళ, సూపర్ స్టార్ మహేశ్ బాబు తన పూర్తి మద్దతు ప్రకటించారు. తన అన్నయ్య రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ హీరోగా నటిస్తున్న 'శ్రీనివాస మంగాపురం' సినిమా కోసం మహేశ్ ఒక ప్రత్యేక వీడియోను తన సోషల్ మీడియాలో విడుదల చేశారు. తన అబ్బాయ్ జయకృష్ణను ఆశీర్వదించాలని ఆయన అభిమానులను కోరారు. ఈ వీడియోలో మహేశ్ బాబు మాట్లాడుతూ.. "మా అన్నయ్య అబ్బాయి జయకృష్ణ నటుడిగా పరిచయం అవుతుండటం చాలా ఆనందంగా ఉంది. మా కుటుంబమంతా ఎంతో ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తోంది. సినిమా టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ బాగున్నాయి. జయకృష్ణ, రాషా థడానీ జంట చూడముచ్చటగా ఉంది. వారిని అందంగా చూపించిన దర్శకుడు అజయ్ భూపతికి నా అభినందనలు" అని అన్నారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని మహేశ్ పంచుకున్నారు. "ఈ సినిమా జులై 30న విడుదలవుతోంది. అదే రోజు నా మొదటి సినిమా 'రాజకుమారుడు' కూడా విడుదలైంది. నిర్మాత అశ్వినీదత్ గారే ఈ డేట్ ప్లాన్ చేసి ఉంటారని అనుకుంటున్నాను. వైజయంతి సంస్థ నుంచి నేను, రామ్ చరణ్, అల్లు అర్జున్ వచ్చాం. ఇప్పుడు జయకృష్ణ, రాషా కూడా అదే బ్యానర్ నుంచి వస్తున్నారు. ఇది వాళ్ల అదృష్టం. మా నాన్నగారి అభిమానులు, నా అభిమానులు జయకృష్ణ, రాషాలను ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని మహేశ్ తెలిపారు.

# 'ఆదర్శ కుటుంబం' నుంచి కీలక అప్‌డేట్..
# వెంకటేశ్ పాత్ర పేరు ఇదే!




**- త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47'**

సినిమాలో వెంకీ 'చిట్టి బాబు' పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడి
రేపటి నుంచి ఇతర పాత్రల వివరాలు ప్రకటిస్తామన్న మేకర్స్
ఈ చిత్రంలో కీలక పాత్రలో నారా రోహిత్ నటిస్తున్నట్లు ప్రకటన
అక్టోబర్ 2న సినిమా విడుదల కానున్నట్లు అధికారికంగా వెల్లడి

విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త చిత్రం నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47- ఏకే 47' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వెంకీ పోషిస్తున్న పాత్ర పేరును మేకర్స్ తాజాగా వెల్లడించారు. ఈ సినిమాలో ఆయన 'చిట్టి బాబు' అనే పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. రేపటి నుంచి సినిమాలోని ఒక్కో పాత్రను పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా వెంకటేశ్‌ను చిట్టి బాబుగా, హీరోయిన్ శ్రీనిధి శెట్టిని స్వర్ణగా, ఇతర నటులు యువీన పార్థవిని సంపూర్ణగా, రాజా ప్రజ్వల్‌ను సర్వగా పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. ఇటీవలే నటుడు నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా, ఆయన ఈ సినిమాలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించి ఓ ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేయగా, అందులో ఆయన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. గతంలో 'వెంకీ77'గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. వెంకటేశ్ గత చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' ఘన విజయం సాధించడం, దానికితోడు త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆయన మొదటిసారి పూర్తిస్థాయి హీరోగా నటిస్తుండటంతో ఈ సినిమాపై ఆసక్తి రెట్టింపయింది. గతంలో వెంకటేశ్ కెరీర్‌లోని సూపర్ హిట్ చిత్రం 'నువ్వు నాకు నచ్చావ్'కు త్రివిక్రమ్ రచయితగా పనిచేసిన సంగతి తెలిసిందే. ఈ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47- ఏకే 47' చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# తన మొదటి సినిమా వెనుక కథ చెప్పిన రకుల్ ప్రీత్

**కాలేజీలో ఉండగా వచ్చిన సినిమా ఆఫర్**
**కారు కొనాలనే ఉద్దేశంతోనే నటనకు ఓకే చెప్పానన్న రకుల్ ప్రీత్**
**చదువు పూర్తి చేశాకే ఇండస్ట్రీలోకి రీఎంట్రీ**
**ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా సొంతంగా ఎదిగానన్న రకుల్**



ప్రముఖ కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ తన సినీ ప్రస్థానం ప్రారంభమైన తీరు గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సినిమాలపై మక్కువతో కాకుండా, కేవలం ఒక కారు కొనుక్కోవాలనే లక్ష్యంతోనే తాను నటిగా మారినట్లు ఆమె వెల్లడించారు. ఇటీవల జరిగిన 'రైజింగ్ భారత్ సమ్మిట్'లో పాల్గొన్న రకుల్... తాను కళాశాలలో చదువుతున్న రోజుల్లోనే కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి అనుకోకుండా అవకాశం వచ్చిందని తెలిపారు. తన ఛాయాచిత్రాలను చూసిన కొందరు ప్రతినిధులు తన తండ్రిని సంప్రదించి, సినిమాలో నటించమని కోరారని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తనకు సినిమాలపై పెద్దగా అవగాహన లేకపోయినప్పటికీ, వారు రూ. 5 లక్షల పారితోషికం ఆఫర్ చేయడంతో వెంటనే అంగీకరించానని చెప్పారు. ఆ డబ్బుతో కారు కొనుగోలు చేసి, తన స్నేహితుల బృందంలో సొంతంగా కారు కొన్న మొదటి అమ్మాయిగా నిలవాలనేదే తన అప్పటి ఏకైక ఆశయమని రకుల్ చిరునవ్వుతో తెలిపారు. ఆ సినిమా కోసం సుమారు 40 రోజుల పాటు చిత్రీకరణలో పాల్గొన్నానని, ఆ సమయంలో కెమెరా ముందు నటించడం తనకు ఎంతో నచ్చిందని వివరించారు. అయితే, ముందుగా తన డిగ్రీ పూర్తి చేయాలని నిశ్చయించుకుని, ఆ తర్వాతే పూర్తిస్థాయిలో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించానని ఆమె పేర్కొన్నారు. ఎటువంటి సినీ నేపథ్యం (గాడ్‌ఫాదర్) లేకుండా 2013లో తిరిగి వచ్చి, ఇక్కడి పరిస్థితులను స్వయంగా నేర్చుకున్నానని స్పష్టం చేశారు. ప్రారంభ దశలో చదువు కారణంగా కొన్ని భారీ ప్రాజెక్టులను కూడా వదులుకోవాల్సి వచ్చిందని రకుల్ తెలిపారు. రకుల్ 2009లో కన్నడ చిత్రం 'గిల్లి'తో సినీ రంగప్రవేశం చేయగా, 2013లో విడుదలైన 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ప్రస్తుతం ఆమె హిందీలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న 'రామాయణ' చిత్రంలో శూర్పణఖ పాత్రలో కనిపించనున్నారు.



## మూడో టీ20 కూడా మనదే...

# జింబాబ్వేపై టీమిండియా క్లీన్ స్వీప్

**- మూడో టీ20లో జింబాబ్వేపై 35 పరుగుల తేడాతో భారత్ విజయం- మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా**
**- అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ (81)- బంతితో మయాంక్ యాదవ్ (3 వికెట్లు), యశ్ ఠాకూర్ (2 వికెట్లు) రాణింపు**
**- జింబాబ్వే తరఫున రియాన్ బర్ల్ (54లి) ఒంటరి పోరాటం**





జింబాబ్వే పర్యటనలో యువకులతో కూడిన భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. -మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఆఖరిదైన మూడో టీ20లో టీమిండియా 35 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (81) ఆకాశమే హద్దుగా చెలరేగగా, బౌలింగ్‌లో మయాంక్ యాదవ్ (3/29) తన పేస్‌తో ప్రత్యర్థిని కట్టడి చేశాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (2) విఫలమైనా, మరో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 81 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (29), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (27) నుంచి మంచి సహకారం లభించింది. చివర్లో రింకూ సింగ్ (14 బంతుల్లో 25) తనదైన శైలిలో మెరుపులు మెరిపించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేసింది. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 193 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. భారత బౌలర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ బెన్నెట్‌ను తొలి బంతికే మయాంక్ యాదవ్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత యశ్ ఠాకూర్ ఒకే ఓవర్లో డియాన్ మైయర్స్ (19), కెప్టెన్ సికిందర్ రజా (0)లను ఔట్ చేసి జింబాబ్వేను కోలుకోలేని దెబ్బతీశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, రియాన్ బర్ల్ (43 బంతుల్లో 54 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి వెస్లీ మధెవెరే (28) కాసేపు సహకరించినా, అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికే సరిపోయింది. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ మూడు వికెట్లతో జింబాబ్వే పతనాన్ని శాసించాడు. యశ్ ఠాకూర్ రెండు వికెట్లు తీయగా, అశోక్ శర్మ, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు.




# గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణం...
## మీరాబాయి చాను చారిత్రాత్మక 'గోల్డెన్ హ్యాట్రిక్'

కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత క్రీడాకారులు తమ సత్తాను ఘనంగా చాటుకున్నారు. భారత వెయిట్‌లిఫ్టింగ్ చరిత్రలో మరో స్వర్ణాధ్యాయాన్ని లిఖిస్తూ స్టార్ లిఫ్టర్, ఒలింపిక్ పతక విజేత మీరాబాయి చాను మహిళల 48 కేజీల విభాగంలో పసిడి పతకాన్ని ముద్దాడింది. ఆదివారం జరిగిన ఈ పోటీలో అద్వితీయ ప్రదర్శన కనబరిచిన ఆమె, వరుసగా మూడోసారి కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం గెలిచి చారిత్రాత్మక హ్యాట్రిక్ పూర్తి చేసింది. ఈ క్రమంలో సరికొత్త గేమ్స్, కామన్వెల్త్ రికార్డులను సైతం బద్దలు కొట్టింది. టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత అయిన మీరాబాయి, ఈ పోటీలో ఆరంభంలో కాస్త తడబడింది. స్నాచ్ విభాగంలో 82 కేజీల బరువును తొలి ప్రయత్నంలో విఫలమైనప్పటికీ, రెండో ప్రయత్నంలో దానిని విజయవంతంగా ఎత్తింది. ఇక మూడో ప్రయత్నంలో ఏకంగా 85 కేజీల బరువును అవలీలగా ఎత్తి, సరికొత్త గేమ్స్, కామన్వెల్త్ రికార్డును తన పేరిట లిఖించుకుంది. దీంతో క్లీన్ అండ్ జెర్క్ విభాగానికి ముందే ప్రత్యర్థులపై 8 కిలోల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. ఆ తర్వాత క్లీన్ అండ్ జెర్క్‌లోనూ తొలి ప్రయత్నంలో విఫలమైనా, ఛాంపియన్‌కు తగ్గ రీతిలో పుంజుకుని రెండో ప్రయత్నంలో 105 కేజీల బరువును ఎత్తి స్వర్ణ పతకాన్ని ఖాయం చేసుకుంది. 2018 గోల్డ్ కోస్ట్, 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల తర్వాత మీరాబాయికి ఇది వరుసగా మూడో కామన్వెల్త్ స్వర్ణం కావడం విశేషం. అంతకుముందు, పురుషుల 60 కేజీల విభాగంలో రిషికాంత సింగ్ చనమ్‌బమ్ అద్భుత ప్రదర్శనతో రజత పతకం గెలిచి ఈ క్రీడల్లో భారత్ పతకాల ఖాతాను తెరిచాడు. రిషికాంత స్నాచ్ విభాగంలో 121 కేజీల బరువును ఎత్తి గతంలో ఉన్న 120 కేజీల కామన్వెల్త్ గేమ్స్ రికార్డును అధిగమించాడు. అనంతరం క్లీన్ అండ్ జెర్క్‌లో 143 కేజీలు ఎత్తడంతో, మొత్తంగా 264 కేజీలతో వెండి పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఈవెంట్‌లో మలేషియాకు చెందిన బిన్ కస్దాన్ మహ్మద్ అనిక్ (273 కేజీలు) స్వర్ణం గెలుచుకోగా, కెన్యాకు చెందిన జాషువా అముంగా (260 కేజీలు) కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు.

# జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

- జిల్లా వ్యాప్తంగా వేగంగా ఓటర్ల జాబితా సవరణ, డిజిటలైజేషన్
- జిల్లాలో 87.93 శాతం పూర్తయిన గణన ఫారాల డిజిటలైజేషన్
- కొత్తగా 90 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- అక్టోబరు 3న తుది ఓటర్ల జాబితా విడుదల
- వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లాలోని ఐదు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితా సవరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 87.88 శాతం డిజిటలైజేషన్ పూర్తి జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1,334 మంది బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ఓటర్ల సమాచార సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలో నిరంతరం పనిచేస్తున్నారన్నారు. జిల్లాలోని మొత్తం 12,32,439 మంది ఓటర్లకు సంబంధించి వంద శాతం గణన ఫారాలను పంపిణీ చేశారన్నారు. అందులో జులై 24 నాటికి 10,83,736 గణన ఫారాలను డిజిటలైజ్ చేసి, జిల్లా వ్యాప్తంగా సగటున 87.93 శాతం పురోగతి నమోదు చేసినట్లు తెలిపారు.

**నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ గణాంకాలు:**
రాయచోటి నియోజకవర్గంలో మొత్తం 292 మంది బీఎల్ఎల ద్వారా 2,58,163 మంది ఓటర్లకు ఫారాలు పంపిణీ చేయగా, 2,24,973 ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసి 87.14 శాతం పురోగతి సాధించారన్నారు.
తంబళ్లపల్లె నియోజకవర్గంలో 236 మంది బీఎల్ఓలద్వారా 2,26,832 ఓటర్ల పంపిణీకి గాను, 1,98,086 ఫారాలను డిజిటలైజ్ చేసి 87.33 శాతం పూర్తి చేశారన్నారు.
పీలేరు నియోజకవర్గంలో 281 మంది బీఎల్ఓల పర్యవేక్షణలో 2,36,532 ఓటర్ల ఫారాలకు గాను, 2,07,327 డిజిటలైజ్ కాగా 87.65 శాతం పురోగతి లభించిందన్నారు.
మదనపల్లె నియోజకవర్గంలో 260 మంది బీఎల్ఓల ద్వారా 2,70,426 ఓటర్ల ఫారాలకు గాను, 2,38,280 ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసి 88.11 శాతంసాధించారన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో 265 మంది బీఎల్ఎల ద్వారా 2,40,488 ఓటర్ల ఫారాలకు గాను, 2,15,070 ఫారాలను డిజిటలైజ్ చేసి జిల్లాలోనే అత్యధికంగా 89.43 శాతం పూర్తి చేశారన్నారు.

**కొత్తగా 80 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు**
ప ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ/నర్వ్యవస్థీకరణ ప్రక్రియను పక్కాగా చేపట్టినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 1,334 పోలింగ్ స్టేషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఓటర్ల సంఖ్య, ప్రయాణ సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలో కొత్తగా మరో 90 పోలింగ్ కేంద్రాల ఏర్పాటును ప్రతిపాదించారన్నారు. ప్రతిపాదనలు ఆమోదం పొందితే జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,424కు పెరగనున్నట్లు చెప్పారు. ఇందులో రాయచోటిలో 10, తంబళ్లపల్లెలో 27. పీలేరులో 15, మదనపల్లెలో 17. పుంగనూరులో 21 కొత్త పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 4 చోట్ల స్థల మార్పులు, 3 చోట్ల పేర్ల మార్పులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**ఓటర్ల జాబితా సవరణ ప్రణాళిక**
ముసాయిదా ప్రచురణ నుండి తుది జాబితా విడుదల వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ: 31,07,2026
క్లెయిమ్లు, అభ్యంతరాల స్వీకరణ: 31.07.2026 నుండి 30.08.2026 వరకు
క్లెయిమ్లు, అభ్యంతరాల పరిష్కారం 31.07.2026 ? 28.09.2026 2
తుది ఓటర్ల జాబితా ప్రచురణ: 03.10.2026.

**అందరి సహకారం అవసరం: కలెక్టర్ నిశాంత్ కుమార్**
డిజిటలైజేషన్ ప్రక్రియ విజయవంతంగా 87.93 శాతానికి చేరుకోవడానికి సహకరించిన జిల్లాలోని ఓటర్లకు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో జరిగే క్లెయిమ్లు, అభ్యంతరాల స్వీకరణ, సవరణ ప్రక్రియల్లో కూడా అందరూ భాగస్వాములై, ఎటువంటి తప్పులు లేని పారదర్శకమైన తుది ఓటర్ల జాబితా తయారీకి పూర్తి సహకారం అందించాలని కోరారు.

## రాయచోటి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నాంది పలికిన కూటమి ప్రభుత్వం

- రెండేళ్లలో సంక్షేమం-అభివృద్ధి రంగాల్లో చారిత్రాత్మక ప్రగతి
- ప్రజల సంక్షేమమే బాధ్యత.. అభివృద్ధి లక్ష్యం: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** ప్రజలతో కలిసి.. ప్రజల కోసం.. ప్రజల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయ ప్రస్థానంలో భాగంగా రాయచోటి నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. సంక్షేమం మా బాధ్యత.. అభివృద్ధి మా లక్ష్యం" అనే నినాదంతో నియోజకవర్గంలోని ప్రతి వర్గం ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు.

**రైతు సంక్షేమానికి పెద్దపీట**
అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నియోజకవర్గంలోని 51,013 మంది రైతులు లబ్ధి పొందుతున్నారని, ప్రతి అర్హ రైతు కుటుంబానికి సంవత్సరానికి ?20,000 ఆర్థిక సహాయం అందుతోందని మంత్రి తెలిపారు. రైతు కుటుంబాలకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**మహిళలకు భరోసా.. వంటింటి ఖర్చులకు ఉపశమనం**
దీపం పథకం ద్వారా 34,521 కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, ఇప్పటివరకు 2,56,359 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ పథకం కింద ?20.49 కోట్ల ఆర్థిక సహాయం అందించామని మంత్రి పేర్కొన్నారు. మహిళా సాధికారతలో భాగంగా 4,900కు పైగా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం బలమైన అండగా నిలుస్తోందన్నారు.

**పేదలు, వృద్ధులు, విద్యార్థులకు సంక్షేమ భరోసా**
37,555 మంది ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించే తల్లికి వందనం పథకం ద్వారా 76,442 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా నియోజకవర్గంలో 6,475 గృహాలు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.

**అభివృద్ధి పనులకు భారీగా నిధులు**
రాయచోటి నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా 395కు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.
- జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.151.65 కోట్లు
- గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.140 కోట్లు
- రాయచోటి మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక వసతులకు రూ.38 కోట్లు- విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి రూ.293 కోట్లు
- మీవీజు పార్క్ అభివృద్ధికి రూ.4.53 కోట్లు
- స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.10.59 కోట్లు

నిధులు కేటాయించి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

**తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**
రాయచోటి నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు జల్ జీవన్ మిషన్ ద్వారా ?400 కోట్లతో తాగునీటి వసతుల విస్తరణ చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. అదనంగా 400 నూతన బోర్లు, తాగునీటి మౌలిక వసతుల అభివృద్ధికి ?21 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

**విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత**
విద్యా మౌలిక సదుపాయాల బలోపేతానికి రూ.53.86 కోట్లు కేటాయించామని మంత్రి తెలిపారు. అలాగే నూతన మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల విద్యాలయం మంజూరు చేయడం జరిగిందన్నారు. వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు 64 వేల మందికి పైగా ప్రజలకు ఆరోగ్య శిబిరాల ద్వారా వైద్య సేవలు అందించామని తెలిపారు. నూతన క్రిటికల్ కేర్ యూనిట్, ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి రూ.29.77 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు.


**ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ప్రభుత్వం**
ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా బాధిత కుటుంబాలకు రూ.14.20 కోట్ల ఆర్థిక సహాయం అందించామని మంత్రి తెలిపారు. అన్న క్యాంటీన్ల ద్వారా రూ.67 లక్షల విలువైన ఉచిత భోజన సేవలు అందించి పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆధ్యాత్మిక, పారిశ్రామిక, మౌలిక వసతుల అభివృద్ధి. నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి ?26 కోట్లు కేటాయించామని మంత్రి తెలిపారు. యువతకు క్రీడా అవకాశాలను విస్తరించేందుకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాయచోటి నియోజకవర్గ ప్రజల సంక్షేమమే' నా ప్రధాన బాధ్యత. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తాలి అని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలతో కలిసి.. ప్రజల కోసం.. రాయచోటి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. రాయచోటి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నాంది పలికిన కూటమి ప్రభుత్వం

## చేనేత కార్మికుల సంక్షేమానికి

# ప్రగడ కోటయ్య సేవలు చిరస్మరణీయం

**- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ**





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** చేనేత కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం అంకితభావంతో సేవలందించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త, చేనేత ఉద్యమ నాయకుడు ప్రగడ కోటయ్య సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అన్నారు. ప్రగడ కోటయ్య 111వ జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం జిల్లా పరిశ్రమల శాఖ, చేనేత ఒ జౌళి శాఖ ఆధ్వర్యంలో మదనపల్లె కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటేశుతో కలిసి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి వేడుకగా నిర్వహించడం ద్వారా చేనేత కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవం మరోసారి చాటిచెప్పబడిందన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న గొప్ప దేశభక్తుడైన ప్రగడ కోటయ్య అనంతరం తన జీవితాన్ని చేనేత కార్మికుల అభ్యున్నతికి అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. చేనేత కార్మికులను సహకార సంఘాలుగా సంఘటితం చేసి వారికి ఆర్థిక భద్రత, ఉపాధి అవకాశాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యునిగా పనిచేస్తూ చేనేత రంగ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టేలా కృషి చేశారని పేర్కొన్నారు.

సహకార సంఘాల బలోపేతం, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాల విస్తరణ, గ్రామీణ చేతివృత్తుల అభివృద్ధి, చేనేత కార్మికుల సామాజిక, ఆర్థిక సంక్షేమం కోసం ప్రగడ కోటయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. వేలాది చేనేత కుటుంబాల జీవనోపాధి మెరుగుపడేందుకు ఆయన చేసిన కృషి నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ప్రస్తుత తరానికి ప్రగడ కోటయ్య జీవితం ఆదర్శమని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ చేనేత రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

డీఆర్ఓ వెంకటేశు మాట్లాడుతూ.. చేనేత కార్మికుల గౌరవాన్ని ఇనుమడింపజేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రగడ కోటయ్య జయంతిని అధికారిక రాష్ట్ర వేడుకగా నిర్వహించాలని నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, జౌళి శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగానికి చేనేత వర్గం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రగడ కోటయ్య నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ స్వాతంత్ర్య సమరయోధుడిగా మహాత్మా గాంధీజీతో కలిసి జాతీయోద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. అనంతరం ప్రజాప్రతినిధిగా శాసనసభ్యుడు, శాసన మండలి సభ్యుడు, పార్లమెంట్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ చేనేత కార్మికుల సంక్షేమం, వారి జీవనోపాధి మెరుగుదల కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. చేనేత రంగ అభివృద్ధి, కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి ఆర్థిక పరిస్థితుల మెరుగుదలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని చేనేత రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చేనేత రంగ అభివృద్ధికి విశేష సేవలందించిన సీనియర్ చేనేత కార్మికులు ఇతి రాజులు, సీనప్ప, సుబ్బరాయుడు, ఆదినారాయణలను ముఖ్య అతిథులు శిల్లు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కె. కృష్ణకిషోర్, చేనేత శాఖ ఏడి పవన్ కుమార్, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేనేత, ఓబీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఒర్సు వీరభాస్కర్, చేనేత రాష్ట్ర నాయకుడు ఎం. నాగరాజు, చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. రామ్ మోహన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాదినేని రమేష్ నాయుడు, గాలివీడు మండల అధ్యక్షుడు శివ్యాల వెంకటరమణ, చిన్నకొట్ల ప్రసాద్, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )